






కాంగ్రెస్ కమిటీలకు స్థానిక గ్రహణం

కామారెడ్డి, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): అధికార కాంగ్రెస్ పార్టీని అన్ని స్థాయిలో సమస్థాగతంగా మరింత బలోపేతం చేయడంపై టీపీసీసీ దృష్టి సారించింది. ఇందుకోసం ఆ పార్టీ అధిష్ఠానం తరచూ సమావేశాలు నిర్వహిస్తూ క్షేత్రస్థాయి నుంచి కేడర్ కదలించేందుకు కార్యాచరణ అమలు చేస్తోంది. ఈ నేపథ్యంలో బ్లాక్, మండల, జిల్లా కాంగ్రెస్ కమిటీలు వేయాలని మొదటి నుంచి భావించింది. గత ఏప్రిల్ నుంచి జిల్లాల వారీగా ఇన్‌చార్జీల ద్వారా సమావేశాలు ఏర్పాటు చేసిన ఆశావహుల పేర్లను కూడా సేకరించింది. ఆ తర్వాత కొద్ది రోజులకే రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జీగా మీనాక్షి నాటరాజన్ బాధ్యతలు చేపట్టడం పార్టీ పరంగా కొత్త మార్గదర్శకాలను రూపొందించడంతో సంస్థాగత కమిటీల ప్రస్తావన ఆగిపోయింది. ఇప్పుడు నామినేట్ పోస్టుల భర్తీతో పాటు సంస్థాగత కమిటీలపై చర్చ జరుగుతుండగా స్థానిక సంస్థల ఎన్నికల సమయంలో మార్పులు, చేర్పులు మంచిది కాదని ఆలోచనలో అధిష్ఠానం ఉన్నట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. స్థానిక సంస్థల ఎన్నికల తర్వాతే పార్టీ పదవులను భర్తీ చేయాలని అధిష్ఠానం భావిస్తోంది. అయితే రాష్ట్రస్థాయి కమిటీలకు డైరెక్టర్ల కోసం మాత్రం ఎమ్మెల్యేల ద్వారా పేర్లను సేకరించారు.

ఇటీవల జిల్లా ఎమ్మెల్యేలు, సీనియర్ నేతలతో సమావేశం

రాష్ట్ర పార్టీ వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్, టీపీసీసీ చీఫ్ మహేష్‌కుమార్‌గౌడ్‌లు ఇటీవల హైదరాబాద్‌లో జిల్లాల వారీ గా సమావేశాలు నిర్వహించారు. కామారెడ్డి జిల్లాలోని ఎమ్మెల్యేతో పాటు సీనియర్ నేతలు పాల్గొన్నా రు. స్థానిక సంస్థల ఎన్నికలకు సన్నద్ధం కావడంతో పాటు సంస్థాగత నామినేట్ పదవులపై చర్చ జరిగింది. ఈ సందర్భంగా రాష్ట్రస్థాయి కార్పొరేషన్ పదవులకై జిల్లా నుంచి పలువురి పేర్లను ఎమ్మెల్యేలు సూచించినట్లు తెలిసింది. ఎమ్మెల్యేలు సూచించిన పేర్లను పార్టీ అధిష్ఠానం పరిశీలిస్తున్నట్లు సమాచారం. కష్టపడే నాయకులు, కార్యకర్తలకు పదవులు ఇవ్వాలని అధిష్ఠానం భావిస్తుందని ప్రజాప్రతినిధు లు సీనియర్లను ఎంపిక చేయాలని మీనాక్షి సూచించినట్లు తెలిసింది.

పార్టీ పదవులు స్థానిక ఎన్నికల ముందా.. తర్వాత

రాష్ట్ర వ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీకి చెందిన డీసీసీ అధ్యక్షులతో పాటు మండల, బ్లాక్ స్థాయి అధ్యక్షులను ప్రస్తుతం మార్చాలా లేకా స్థానిక సంస్థల ఎన్నికలు ముగిసిన తర్వాత మార్చాలా అన్న విషయంలో అధిష్ఠానం ఇంకా ఒక్క నిర్ణయానికి రాలేదని తెలుస్తోంది. స్థానిక సంస్థల ఎన్నికలు, ఆ తర్వాత మూడు సంవత్సరాలు కాగా అసెంబ్లీ ఎన్నికలు రానున్న నేపథ్యంలో ప్రతిష్ఠాత్మకమైన కమిటీలను ఏర్పాటు చేసుకోవాలని అధిష్ఠానం భావిస్తోంది. క్షేత్రస్థాయిలో కొత్త నాయకత్వాన్ని నియమించి పలు కార్యక్రమాలకు ప్రజల్లోకి వెళ్లాలని అనుకుంటుంది. స్థానిక సంస్థల ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో వారిని మార్చాలా వద్దా అని అధిష్ఠానం ఆలోచిస్తున్నట్లు సమాచారం.

- కాంగ్రెస్ కొత్త కమిటీల నియామకంపై తర్జన భర్జన
- బ్లాక్, మండల, జిల్లా అధ్యక్షుల పదవులకు మరికొంత సమయం
- పార్టీ పదవుల కేటాయింపుపై అధిష్ఠానం పునరాలోచన
- స్థానిక ఎన్నికల తర్వాతే కమిటీలు ఏర్పాటు చేయాలని నిర్ణయం
- నామినేట్ పోస్టుల భర్తీకి, డైరెక్టర్ల నియామకాలకు ఓకే
- జిల్లా ప్రజాప్రతినిధులతో పార్టీ అధిష్ఠానం సమావేశం

జిల్లా, మండల కమిటీల్లో మార్పులు

జిల్లా, మండల అధ్యక్షులను అలాగే ఉంచి కమిటీల్లో మార్పులు చేర్పులు చేయాలని అధిష్ఠానం భావిస్తున్నట్లు తెలిసింది. త్వరలోనే ఈ కమిటీల్లో ఒక్కో నియోజకవర్గం నుంచి ఇద్దరు చొప్పున ఉపాధ్యాయులను, ప్రధాన కార్యదర్శులను, ముగ్గురు కార్యదర్శులను, ఒక్క అధికార ప్రతినిధిని నియమిస్తారని సమాచారం. జిల్లాలో ఉన్న అన్ని నియోజకవర్గాల నుంచి ఇంతే సంఖ్యలో సభ్యులు ఆ కమిటీల్లో ఉంటారని తెలిసింది. ఈ పదవుల్లో నియమించేందుకు ఎవరు అర్హులో, మొదటి నుంచి ఎవరు పని చేస్తున్నారో, ఎవరు చురుకుగా వ్యవహరిస్తున్నారో పరిశీలించి పేర్లను తీసుకున్నట్లు సమాచారం. కొత్త కమిటీలను వేసి పాత అధ్యక్షులను కొనసాగించే కంటే అధ్యక్షులను నియమిస్తే ఎలా ఉంటుందనే ఆలోచన చేస్తున్నట్లు తెలిసింది.

అధ్యక్ష పదవి కోసం పోటాపోటీ

అధికార కాంగ్రెస్ క్షేత్ర స్థాయిలో పార్టీని బలోపేతం చేసేందుకు కమిటీలను వేసేందుకు నిర్ణయిస్తోంది. ఈ నేపథ్యంలో జిల్లా పదవులపై పార్టీల క్యాడర్‌లో పోటీ నెలకొంటుంది. ప్రధానంగా జిల్లా అధ్యక్ష పదవి ఎవరిని వరిస్తోందని ఆసక్తి క్యాడర్‌లో చర్చ మొదలైంది. రానున్న ఎన్నికల్లో ఎమ్మెల్యే అభ్యర్థుల ఎంపికలోనే డీసీసీ సూచనలను పరిగణనలోకి తీసుకుంటామని అధిష్ఠానం పేర్కొంటోంది. ప్రస్తుతం డీసీసీ అధ్యక్షుడిగా కైలాస్ శ్రీనివాస్‌రావు కొనసాగుతున్నారు. జిల్లా ఏర్పడినప్పటి నుంచి ఆయనే పదవిలో ఉన్నారు. ప్రస్తుతం కాంగ్రెస్ అధికారంలో ఉండడంతో అధ్యక్ష పీఠంపై పలువురు సీనియర్ నేతలు దృష్టి సారించారు. అదేవిధంగా ఆయా నియోజకవర్గాల ఎమ్మెల్యేలు సైతం తమ అనుచర వర్గానికి డీసీసీ పదవిని కట్టబెట్టేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. జిల్లా కాంగ్రెస్ అధ్యక్ష రేసులో పలువురు సీనియర్ నేతల పేర్లు వినిపిస్తున్నప్పటికీ అందరిని కలుపుకుపోయే మనస్తత్వం, ఆర్థిక, అంగబలం ఉన్న నేతలకు పదవిని కట్టబెట్టాలని అధిష్ఠానం భావిస్తున్నట్లు తెలిసింది.



నిజాంసాగర్‌లోకి పెరిగిన నీటి మట్టం

నిజాంసాగర్‌లోకి భారీగా వరద

నిజాంసాగర్, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి) : నిజాంసాగర్ ప్రాజెక్టులోకి ఎగువ ప్రాంతాల నుంచి భారీ వరద నీరు వచ్చి చేరుతోంది. ఆదివారం సాయంత్రం నాటికి ఎగువ ప్రాంతాల నుంచి 5393 క్యూసెక్కుల వరద నీరు మంజీరా వెంట వస్తూ ఉంది. దీంతో నిజాంసాగర్ ప్రాజెక్టులో క్రమేపీ నీటి సామర్థ్యం పెరుగుతూ ఉంది. నిజాంసాగర్ ప్రాజెక్టు పూర్తి నీటి సామర్థ్యం 1405 అడుగుల గాను 1391.50 అడుగుల నీటి సామర్థ్యానికి చేరుకుంది. ప్రస్తుతం నిజాంసాగర్ ప్రాజెక్టులో 17.802 టీఎంసీలకు గాను 4.723 టీఎంసీల నీరు నిల్వ ఉంది.

పెద్దమ్మ ఆశీస్సులతో..

రైతులు అభివృద్ధి చెందాలి

- ఎమ్మెల్యే మదన్‌మోహన్



సజ్జన్‌పల్లిలో పెద్దమ్మ ఆలయానికి భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే

లింగంపేట, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి) : పెద్దమ్మ తల్లి ఆశీస్సులతో ఎల్లారెడ్డి నియోజకవర్గంలోని రైతులు అభివృద్ధి చెందాలని ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్ అన్నారు. ఆయన ఆదివారం లింగంపేట మండలంలోని సజ్జన్‌పల్లిలో పెద్దమ్మ ఆలయ నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పెద్దమ్మ ఆలయ నిర్మాణానికి తనవంతు సహకారం అందిస్తానని ఆయన హామీ ఇచ్చారు. ఎల్లారెడ్డి నియోజకవర్గం అభివృద్ధిలో దూసుకుపోతుందని ఆయన తెలిపారు. మరింత అభివృద్ధికి అమ్మవారి ఆశీర్వాదాలు కావాలని ఆయన కోరారు. ఆలయానికి రోడ్డు, విద్యుత్ సౌకర్యాలు కల్పిస్తానని హామీ ఇచ్చారు. లింగంపేట నుంచి ఎక్కపల్లి-సజ్జన్‌పల్లీల మీదుగా బస్సు సౌకర్యం కల్పిస్తానని తెలిపారు. అనంతరం గ్రామస్థులు ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమంలో పాల్గొని భక్తులకు వడ్డించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు నారాగౌడ్, మోతె మాజీ సర్పంచ్ రాంరెడ్డి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ రాజు, నాయకులు రఫీక్, ప్రసాద్‌గౌడ్, అశోక్, రవి, అట్టెం శ్రీను, ముదిరాజ్ సంఘం నాయకులు విఠల్, సాయికుమార్, బాలయ్యలు ఉన్నారు.



అడవి పందులు ధ్వంసం చేసిన పంటను చూపుతున్న రైతు

అడవి పందుల నుంచి పంటలను రక్షించాలి

రాజంపేట,ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): రాజంపేట మండలంలోని బస్వన్నపల్లి గ్రామంలో గ్రామానికి చెందిన ఏనుగు రాజీరెడ్డికి సంబంధించిన రెండు ఎకరాల మొక్కజొన్న పంటను అడవి పందులు ధ్వంసం చేశాయి. రాత్రి పగలు తేడాలేకుండా అటవీప్రాంతం నుండి అడవిపందులు పంటచేన్లలోకి వచ్చి ధ్వంసం చేస్తున్నాయని వేలు ఖర్చుచేసి పంటలు సాగుచేశామని రైతులు వాపోతున్నారు. పందులను తరమేందుకు మైకులు,సౌండ్ వివిధ మార్గాల ద్వారా ప్రయత్నిస్తున్నప్పటికి ఫలితం లేకుండా పోతుందని పేర్కొంటున్నారు. చేతికి వచ్చే సమయంలో అటవి పందులు పూర్తిగా నష్టం చేకుర్చుతున్నాయని పంటలకు రక్షణ కలిగించేలా అటవి అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.నష్టపోయిన మొక్కజొన్న పంటకు ప్రభుత్వం నష్టపరిహారం అందించాలని రైతులు కోరుతున్నారు.



నివాళ్లు అర్పిస్తున్న మున్నూరుకాపు సంఘు సభ్యులు

పుంజాల శివశంకర్‌కు ఘన నివాళి

కామారెడ్డి టౌన్, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): కేంద్ర మాజీ మంత్రి పుంజాల శివశంకర్‌కు ఆదివారం మున్నూరుకాపుల ఆధ్వర్యంలో ఘన నివాళి అర్పించారు. ఈ సందర్భంగా అపెక్స్ కమిటీ మెంబర్,జిల్లా గౌరవ అధ్యక్షుడు మామిండ్ల అంజయ్య మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాల పట్ల కొనసాగుతున్న వివక్షను రూపుమాపాలని, బీసీలకు రిజర్వేషన్‌లు తప్పనిసరిగా అవసరమని ఆనాడే గుర్తించిన వ్యక్తి శివశంకర్ అని అన్నారు. హైదరాబాద్ ట్యాంక్ బం డ్‌పై ఆయన కాంస్య విగ్రహం ఏర్పాటు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్నూరుకాపు మీదిగడ్డ సంఘం అధ్యక్షుడు వేణు, ప్రధాన కార్యదర్శి రాజేందర్, కోశాధికారి మహేష్, ఉపాధ్యక్షుడు రమేష్, జిల్లా సెక్రెటరీ లింగం, నీలం నర్సింలు తదితరులు పాల్గొన్నారు.

రైతు బీమాకు దరఖాస్తు చేసుకోవాలి

పల్వంచ, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): జూన్ 5వ తారీఖులోపు కొత్త పట్టా పాస్‌బుక్కు వచ్చిన రైతులురైతుబీమాకు దరఖాస్తు చేసుకోవాలని పల్వంచ ఏఈవో శ్రీనివాస్‌రావు సూచించారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ ఆధార్‌కార్డులో 18సంవత్సరాల నుండి 59సంవత్సరాల వయస్సు ఉన్న రైతులు అర్హులని, ఇందుకు గానై దరఖాస్తు ఫారం, పట్టాపాస్ బుక్కు, నామినీ ఆధార్ కార్డుతో ఈ నెల 13లోపు రైతు వేదికలో దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

పెన్షనర్ల సమస్యలను పరిష్కరించాలి

కామారెడ్డి టౌన్, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): తెలంగాణ ప్రభుత్వ పెన్షనర్ల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తు సోమవారం హైదరాబాద్‌లో డీటీఎఫ్(డెమెక్రాటిక్ టీచర్స్‌పెడరేషన్) ఆధ్వర్యంలో ధర్నా నిర్వహిస్తున్నామని జిల్లా అధ్యక్షుడు దేవుల తెలిపారు.

విద్యార్థుల్లో సృజనాత్మకతను

వెలికితీసేందుకు ప్రయాస్‌కు శ్రీకారం

- దరఖాస్తుకు ఈనెల 17న చివరి తేది
- ఎంపిక గడువు వచ్చే నెల 30 వరకు
- అక్టోబరు 15న ఫలితాల విడుదల

కామారెడ్డి టౌన్, ఆగస్టు 10(ఆంధజ్యోతి): పాఠశాల విద్యార్థుల్లోని సృజనాత్మకతను వెలికితీస్తూ, వారి సామాజిక పరిశోధనలను ప్రోత్సహించాలనే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం ప్రమోషన్ ఆఫ్ రీసెర్చ్ అట్టిట్యూడ్ ఎమాంగ్ యంగ్ అండ్ యాస్పిరింగ్ స్టూడెంట్స్ (ప్రయాస్) పేరుతో ప్రత్యేక కార్యక్రమాన్ని ప్రవేశపెట్టింది. ఉన్నత పాఠశాల విద్యార్థుల్లో శాస్త్రీయమైన పరిశోధన, ఆవిష్కరణలు ప్రోత్సహించేందుకు, పరిశోధనల్లో జిజ్ఞాస పెంచేందుకు జాతీయ విద్యా పరిశోధన (ఎన్‌సీఆర్‌టీ) ఈ పథకాన్ని తీసుకువచ్చింది. అందులో భాగంగా 2025-26 విద్యా సంవత్సరానికి విద్యార్థుల నుంచి పరిశోధన ప్రాజెక్ట్ ప్రతిపాదనలను ఆహ్వానిస్తోంది.

అర్హతలు, నిబంధనలు

విద్యార్థులు తమ పరిసర ప్రాంతాల్లోని ప్రధాన సమస్యలు గుర్తించి పరిష్కారానికి శాస్త్రీయ పరిశోధన చేయాలి. తమ పాఠశాలల్లోని ఉపాధ్యాయుల ఆలోచనలు తీసుకోవచ్చు. ఎంపికైన ప్రతిపాదనలకు రూ.50వేలు ప్రోత్సాహకం అందించనున్నారు. ఈ పోటీల్లో పాల్గొనే విద్యార్థులు 14 నుంచి 18 ఏళ్ల వయస్సు కలిగి 9వ తరగతి నుంచి 11వ తరగతి చదువుతున్న అన్ని యాజమాన్య పాఠశాలలకు చెందినవారు దరఖాస్తు చేసుకునేందుకు అర్హులు. ఒకరు లేదా ఇద్దరు బృందంగా ఏర్పడి తమ పరిశోధనను కొనసాగించవచ్చు. 9వ తరగతి నుంచి 11వ తరగతులకు బోధించే ఫిజిక్స్, కెమిస్ట్రీ, మ్యాథ్స్, బయోలజీ బోధించే పోస్ట్ గ్రాడ్యుయేట్ టీచర్ గైడ్‌గా వ్యవహరించవచ్చు. విద్యార్థులకు తమ ఆలోచనలను హెచ్‌టీఎంఎల్, పీడీఎఫ్ ఫార్మాట్‌లో ప్రయాస్2525 జీ మెయిల్.కామ్‌కు మెయిల్ చేయాలి. ఒక పాఠశాల నుంచి ఒక దరఖాస్తును మాత్రమే పరిగణనలోకి తీసుకుంటారు.

ఏ పరిశోధనలు చేయాలంటే..

స్థానిక సమస్యను గుర్తించి అధ్యయనం చేసి ఆ సమస్య గత కారణాన్ని శాస్త్రీయంగా పరిశోధించాల్సి ఉంటుంది. అదేవిధంగా ఏదైనా సమస్యకు శాస్త్రీయ పరిష్కారాన్ని కనుగొనే ప్రయత్నం చేయాలి. ప్రాజెక్టును ప్రారంభించిన ఏడాదిలోపే పూర్తి చేయాలి. ఎంపికైన పరిశోధన కోసం రూ.50వేల గ్రాంటు లభిస్తోంది. అందులో విద్యార్థులకు రూ.10 వేలు, పాఠశాల ఉపాధ్యాయులు, ఉన్నత విద్యా సంస్థ నిపుణుడికి రూ.20వేలు, విద్యా సంస్థకు రూ.20 వేలు అందుతాయి.

దరఖాస్తుకు ఈనెల 17 వరకు గడువు ఉంది

- సిద్ధిరాంరెడ్డి, జిల్లా సైన్స్ అధికారి, కామారెడ్డి



ప్రయాస్‌కు సంబంధించిన దరఖాస్తులకు ఈనెల 17 వరకు గడువు ఉంది. వచ్చిన దరఖాస్తులను సెప్టెంబరు 15 వరకు పరిశీలించి 30 తేదీ వరకు ప్రాజెక్టును ఎంపిక చేసి అక్టోబరు 15న ఫలితాల ప్రకటిస్తారు. విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను బయటపెట్టేందుకు కేంద్ర ప్రభుత్వం ఈ పథకానికి శ్రీకారం చుట్టింది. ప్రాజెక్ట్ ప్రారంభించిన ఏడాదిలోపే పూర్తి చేయాల్సి ఉంటుంది.

జిల్లాలో మోస్తరు వర్షం



కామారెడ్డిలో కురుస్తున్న వర్షం



బీబీపేటలో వర్షానికి పారుతున్న వాగు

కామారెడ్డి టౌన్, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): కామారెడ్డి జిల్లా కేంద్రంతో పాటు ఆయా మండలాలు, గ్రామాల్లో ఆదివారం మోస్తర్ వర్షం కురిసింది. సుమారు రెండు నుంచి మూడు గంటల పాటు వర్షం కురవడంతో రోడ్లన్నీ జలమయం అయ్యాయి. ఈ వర్షాలతో రైతులు కాస్త ఊపిరి పీల్చుకున్నారు. జిల్లాలో గడిచిన 24 గంటల్లో మాచారెడ్డి మండలంలో 94.5 మి.మీలు, బీబీపేట 49.8, లింగంపేట 48.0, దోమకొండ 34.0, ఎల్లారెడ్డిమండలంలో మాచాపూర్‌లో 26.3, పల్వంచ మండలం ఎల్పుగొండలో 30.8, నాగిరెడ్డిపేట 28.8, బాన్సువాడ మండలంలోని కొల్లూర్ 23.8 మి.మిల వర్షం కురిసింది.

ప్రవహిస్తున్న వాగులు, కాలువలు

దోమకొండ(బీబీపేట): దోమకొండ, బీబీపేట మండలాల్లో ఆదివారం ఉదయం కురిసిన వర్షానికి ఎడ్లకట్ట వాగు ప్రవహించింది. చెరువు, కుంటల్లోకి నీరు వచ్చి చేరింది. ఉదయం 5 గంటల నుంచి 9 గంటల వరకు వర్షం కురవడంతో పంట పొలాలు నీట మునిగాయి. వర్షాకాలం ప్రారంభమైనప్పటి నుంచి దోమకొండ, బీబీపేట మండలాల్లో ఇదే భారీ వర్షంగా రైతులు భావిస్తున్నారు. వాగులు పారడం, చెరువులు నిండడటంతో రైతాంగం సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

విద్యుత్ సమస్యల పరిష్కార వేదికలను సద్వినియోగం చేసుకోవాలి

విద్యుత్‌శాఖ ఏడీఈ ప్రసాద్‌రెడ్డి

ఎల్లారెడ్డి రూరల్, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డి సబ్ డివిజన్ పరిధిలోని విద్యుత్ వినియోగదారుల సమస్యలను తక్షణమే పరిష్కరించడానికి మంగళవారం ప్రత్యేక పరిష్కార వేదికను నిర్వహించడం జరుగుతుందని విద్యుత్‌శాఖ ఏడీఈ ప్రసాద్‌రెడ్డి, ఏఈ వెంకటస్వామి ఆదివారం సంయుక్త ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఏఈ మాట్లాడుతూ వినియోగదారులు ఎదుర్కొంటున్న విద్యుత్ సమస్యలను ఈ పరిష్కార వేదికలో తక్షణమే పరిష్కరిస్తామని, మీటర్ రీడింగ్‌లో లోపాలు, కొత్త కనెక్షన్‌లు, తదితర అంశాలన్నింటిని తక్షణమే పరిష్కరించడానికి ఈ వేదికను ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఉదయం 10:30గంటల నుండి మధ్యాహ్నం 1:15గంటల వరకు కొనసాగుతుందని, నాగిరెడ్డిపేట్, ఎల్లారెడ్డి మండలాల పరిధిలోని గ్రామాల విద్యుత్ వినియోగదారులు అధికారుల సమక్షంలో నిర్వహించే ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.



పతకాలు సాధించిన జిల్లా వాసులు

యోగాసన పోటీల్లో జిల్లావాసుల ఉత్తమ ప్రతిభ

కామారెడ్డి టౌన్, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): ఆదిలాబాద్‌లో జరిగిన 6వ రాష్ట్రస్థాయి సీనియర్ యోగాసన పోటీల్లో జిల్లావాసులు ఉత్తమ ప్రతిభ కనభరిచి 8 పతకాలు సాధించారని యోగాసనా స్పోర్ట్స్ ఆర్గనైజింగ్ సెక్రెటరీ యోగారాంరెడ్డి తెలిపారు. ఇందులో డి.సురేందర్‌కు సీనియర్ బీ కేటగిరి బ్యాక్ బెండింగ్‌లో గోల్, ట్రెడిషన్‌లో రజతం, సీహెచ్.రాజ్‌కుమార్‌కు సీనియర్ ఏ గ్రూప్ ట్విస్టింగ్‌లో కాంస్యం, సుపైన్‌లో కాంస్యం, ఫార్వర్డ్ బెండింగ్‌లో కాంస్యం, యూ.అనిల్‌కు సీనియర్ కేటాగిరిలో క్యాంసం, సీహెచ్.తిరుపతికి హ్యాండ్ బ్యాలెన్స్‌లో కాంస్యం, రాజుకు సీనియర్ సి. కెటాగిరి ట్రేడిషన్‌లో రజతం వచ్చాయని తెలిపారు.



మాట్లాడుతున్న వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కొత్త నర్సింలు

డబుల్ ఇళ్ల పంపిణీలో నాయకుల కుట్రలు

- వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కొత్త నర్సింలు

భిక్కనూరు, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): భిక్కనూరు మండల కేంద్రంలోని డబుల్ బెడ్‌రూం ఇళ్ల పంపిణీలో రెండు ప్రధాన పార్టీల నాయకులు కుట్రలు పన్నుతున్నారని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కొత్త నర్సింలు ఆరోపించారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ గత బీఆర్ఎస్ ఆధ్వర్యంలో డబుల్‌బెడ్ రూం ఇండ్లు నిర్మించినప్పటికీ వాటిని అర్హులకు పంపిణీ చేయలేదని, ప్రస్తుతం అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తుందన్నారు. భిక్కనూరులో డబుల్‌బెడ్ రూం ఇళ్లను పంపిణీ చేయడంతో అధికారులు, ఇరుపార్టీల నాయకులు విఫలమయ్యారని ఆరోపించారు. వెంటనే అర్హులకు డబుల్ బెడ్ రూం ఇళ్లను పంపిణీ చేయాలని లేనియెడల వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో పెద్దఎత్తున ఆందోళన కార్యక్రమాలను చేపడుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రహిమా, హైమది, చంద్రకళ, లక్ష్మీ, భూమేష్, హరి, తదితరులు పాల్గొన్నారు.

అంబులెన్స్‌లో ప్రసవం



అంబులెన్స్‌లో ప్రసవం చేసి బాబును చూపిస్తున్న సిబ్బంది

బీర్కూర్, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): 108 అంబులెన్స్‌లో గర్భిణిని బీర్కూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి కాన్పు కోసం తీసుకువస్తున్నారు. అయితే గర్భిణీకి మార్గమధ్యంలోనే పురిటి నొప్పులు వచ్చాయి. అంబులెన్స్ సిబ్బంది వెంటనే రోడ్డు పక్కన వాహనాన్ని నిలిపివేయించి కాన్పు చేశారు. గర్భిణి ఒక పండంటి మగబిడ్డకు జన్మనిచ్చింది. తల్లీబిడ్డ క్షేమంగా ఉన్నారని అంబులెన్స్ సిబ్బంది తెలిపారు. కుర్లా గ్రామానికి చెందిన చాకలి అనిత నిండు గర్భిణి. కాన్పు నిమిత్తం 108కు కాల్ చేశారు. బీర్కూర్ నుంచి అంబులెన్స్ వెళ్లింది. అంబులెన్స్‌లో గర్భిణిని తీసుకువస్తుండగా మార్గమధ్యంలో నొప్పులు వచ్చాయి. ఈఎంటీ రవి, పైలెట్ రాజు కాన్పు చేయగా అనిత మగబిడ్డకు జన్మ ఇచ్చింది. వారిని బీర్కూర్ పీహెచ్‌సీకి తీసుకువచ్చి అడ్మిట్ చేశారు.



పెద్దమ్మ గుడి పరిసరాల పరిశీలన



ప్రజలకు సూచనలు ఇస్తున్న అటవీశాఖ అధికారులు

ఆర్మూర్, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): ఆర్మూర్ పట్టణ శివారులోని పెద్దమ్మ గుడి పరి సరాలను ఆదివారం ఆటవి శాఖ అధికారులు పరిశీలించారు. గత కొన్ని రోజులుగా ఈ ప్రాంతంలో చిరుత పులి సంచరిస్తుందని స్థానికులు చెప్పడంతో అటవీఅధికారులు ఆలయ పరిసరాలను పరిశీలించారు. ఇటీవల మేకలు మేపుతున్న సమయంలో చిరుత పులి ఒక మేకను ఎత్తుకెళ్లిందని కొరైలకాపరి గ్రామస్థులకు చెప్పడంతో ఈ ప్రాంతంలో చిరుత పులి తిరుగు తుందనే అనుమానం మొదలయింది. సుమారు రెండు నెలల క్రితం చిరుత పులి సిద్ధుల గుట్టపై పలువురికి కనిపించింది. దీంతో చిరుత పులి సంచరిస్తుందనే అనుమానాలు బలపడ్డాయి. అటవీశాఖ అధికారులు పరిసరా ప్రాంతాల రైతులకు, ఆలయ కమిటీ సభ్యులతో మాట్లాడి ఇప్పటి నుంచి ప్రతీ రోజు పరిశీలిస్తామని హామీ ఇచ్చారు. ఆలయానికి వచ్చే భక్తులు, వ్యవసాయ పనుల నిమిత్తం పంట పొలాలకు వెళ్లే రైతులు జాగ్రత్తగా ఉండాలని సూచించారు. సాధ్యమైనంత వరకు ఒంటరిగా వెళ్లకుండా చూడాలన్నారు. ఆలయానికి వెళ్లేవారు పరిసరా ప్రాంతాలను పరిశీ లించిన తర్వాతనే వెళ్లాలని అటవీశాఖ అధికారులు కోరారు.

నేడు సప్తాహ కార్యక్రమం ప్రారంభం



రుక్మిణి, విఠలేశ్వర స్వామి విగ్రహాలు

మోస్రా,ఆగస్టు10(ఆంధ్రజ్యోతి): మోస్రా మండలంలోని చింతకుంట గ్రామ శివారులోని అటవీ ప్రాంతంలో గల సిద్ధుల గుట్ట శివాలయం, రుక్మిణి విఠలేశ్వర ఆలయం వద్ద శ్రావణ మాసం చివరి వారం సందర్భంగా నేటి నుంచి సప్తాహ కార్యక్రమం ప్రారంభిస్తున్నామని ఆలయ కమిటీ అధ్యక్షుడు లింగయ్య తెలిపారు. చుట్టు పక్క మండలాల గ్రామాలభక్తులు దైవ కార్యక్రమంలో పాల్గొని భగవంతుని ఆశీస్సులు పొందాలని ఆయన తెలిపారు.

క్రైం సమాచారం

మద్యం మత్తులో ముగ్గురిపై దాడి



గాయాలైన అనిల్, దీపిక

మోపాల్, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి):మద్యం మత్తులో యువకుడు ముగ్గురిపై కల్లుసీసాతో దాడి చేసి వీరంగం సృష్టించిన సంఘటన గూపన్‌పల్లిలో శనివారం రాత్రి జరిగింది. ఈ సంఘటన వివరాలు నిజామాబాద్ రూరల్ పోలీస్ స్టేషన్ ఎస్సై ఆరీఫ్ తెలిపిన మేరకు ఇలా ఉన్నాయి. రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని గూపన్‌పల్లి గ్రామానికి చెందిన మదన్ మద్యం మత్తులో ఓకిరాణా దుకాణం ముందు కూర్చున్నాడు. ఈ క్రమంలో అదే గ్రామానికి చెందిన రాంపల్లి శైలేందర్ అతని స్నేహితుడు అనిల్‌లు ఇద్దరు బయటకు వెళ్లి తిరిగి అనిల్‌ను ఇంటి వద్ద దింపడానికి బైక్‌పైన వెళ్లినట్లు తెలిపారు. ఈమేరకు పక్కనే ఉన్న కిరాణాషాపులో వాటర్‌బాటిల్ తీసుకోవడానికి వెళ్లగా అక్కడే మద్యం మత్తులో కూర్చొని ఉన్న మదన్‌కి శైలేందర్ కాలు తగలడంతో మదన్‌కు శైలేందర్ మధ్య మాటల యుద్ధం పెరిగింది. మాటా మాటా పెరిగి క్షణికావేశంతో పక్కన ఉన్న కల్లు బట్టీలోంచి పగిలిన సీసాను తెచ్చి శైలేందర్‌పై, అతడి స్నేహితుడు అనిల్‌పై దాడి చేశాడు. అదే సమయంలో అక్కడే ఉన్న అనిల్ అక్క దీపికపై కూడా దాడికి పాల్పడ్డాడు. తీవ్ర గాయాలపాలైన శైలేందర్, అనిల్‌ను జిల్లా కేంద్రంలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. వారి పరిస్థితి విషమంగా ఉందని తెలిపారు. రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఆరీఫ్ తెలిపారు.

హాస్టల్ వార్డెన్ ఆత్మహత్య

ఆర్మూర్‌టౌన్, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శాస్త్రీనగర్‌లో ఎస్సీ బాలికల హాస్టల్ వార్డెన్ షబాన బేగాం శనివారం ఆత్మహత్యకు పాల్పడింది. రాఖీ పౌర్ణమిని పురస్కరించుకొని రెండు రోజులు సెలవులు రావడంతో తన స్వగ్రామమైన జగిత్యాలకు వెళ్లిన ఆమె శనివారం రాత్రి తన గృహంలో ఉరివేసుకొని మృతిచెందినట్లు బంధువులు తెలిపారు. ఆమె మృతిపట్ల జిల్లాలోని హాస్టల్ వార్డెన్‌లు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.

ప్రమాదవశాత్తు చెరువులో పడి వృద్ధురాలి మృతి

ధర్పల్లి, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి):ప్రమాదవశాత్తు చెరువులో పడి మండలంలోని రామడుగు గ్రామానికి చెందిన ముత్యంగారి గంగవ్వ (72) వృద్ధురాలు మృతి చెందిన సంఘటన ఆదివారం చోటుచేసుకుంది. గ్రామా నికి చెందిన గంగవ్వ ఉదయం ఇంట్లో నుంచి బయలుదేరి సాయంత్రానికి రాకపోవడంతో గ్రామంలోగల ఎల్లమ్మ చెరువులో గ్రామస్తులకు మృతదేహం కనిపించడంతో కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

చీమన్‌పల్లిలో ఒకరి ఆత్మహత్య

సిరికొండ, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి):చీమన్‌పల్లి గ్రామానికి చెందిన చందాల లక్ష్మి (63) మానసిస్థితి బాగాలేకపోవడం వల్ల ఇంట్లోనే ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై రామకృష్ణ తెలిపారు. లక్ష్మి ఒంటరిగా నివసించడం వల్ల తీవ్రమైన మనోవేధనకు గురై తన నివాసంలోనే ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్సై పేర్కొన్నారు. కుమారుడు చందాల భాస్కర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్లు ఎస్సై రామకృష్ణ తెలిపారు. శవపంచనామా చేసి పోస్టుమార్టం కోసం నిజామాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి పంపినట్లు ఆయన పేర్కొన్నారు.

పేకాట రాయుళ్ల పట్టివేత

సిరికొండ, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి):సిరికొండ గ్రామ శివారులో ఖాళీ స్థలంలో పేకాట ఆడుతున్న ఆరుగురు వ్యక్తులను పట్టుకున్నట్లు ఎస్సై రామకృష్ణ తెలిపారు. పేకాట ఆడుతున్న వారిని అదుపులోకి తీసుకొని 4200 రూపాయల నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు. పేకాట ఆరుగురు వ్యక్తులపై కేసులు పెట్టినట్లు ఎస్సై తెలిపారు.

మూడో విడతలో ఇంజనీరింగ్‌లో 81 మంది విద్యార్థుల కేటాయింపు

డిచ్‌పల్లి, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి):నూతనంగా ఏర్పాటైన తెలంగాణ యూనివర్సిటీ ఇంజనీరింగ్ కళాశాలలో 3వ విడత కౌన్సిలింగ్ లో 81 మంది విద్యార్థులను కేటాయించినట్లు తెలంగాణ యూనివర్సిటీ అధికారులు తెలిపారు. కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ విభాగంలో 65, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ (ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ విభాగం)లో 9, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ విభాగంలో 4, డాటా సైన్సెస్ విభాగంలో 3 చొప్పున విద్యార్థులు కళాశాలకు కేటాయించినట్లు యూనివర్సిటీ అధికారులు అన్నారు.

పల్లెల అభివృద్ధి బీజేపీతోనే సాధ్యం

● వచ్చే సంస్థగత ఎన్నికలలో అత్యధిక సీట్లను కైవసం చేసుకుంటాం ● యువత వ్యాయమ శాలలను సద్వినియోగం చేసుకోవాలి: ప్రకాష్‌రెడ్డి, మోహన్‌రెడ్డి



వ్యాయమశాల పనులను ప్రారంభిస్తున్న దృశ్యం

బోధన్,ఆగస్టు10(ఆంధ్రజ్యోతి): దేశానికి గ్రామాలు పట్టుకొమ్మలని, గ్రామాల అభివృద్ధి బీజేపీతోనే సాధ్యమని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మేడపాటి ప్రకాష్ రెడ్డి, మోహన్ రెడ్డిలు అన్నారు. ఆదివారం బోధన్ మండలంలోని అమ్దాపూర్ గ్రామంలో యువత కోసం వ్యాయమ శాలలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బోధన్ నియోజకవర్గంలోని గ్రామాల అభివృద్ధి కోసం బీజేపీ ఎంపీ ధర్మపురి అరవింద్ తమ ఎంపీ నిధుల నుంచి అమ్దాపూర్ గ్రామంలో వ్యాయమశాల కొరకు రూ.4లక్షల మంజూరు చేశారని ఈ సందర్భంగా పేర్కొన్నారు. మండలంలోని మినార్‌పల్లి గ్రామంలో గల సేవాలాల్ గుడి ప్రహరీ కొరకు రూ.3లక్షలు రాంపూర్ గ్రామంలో మహిళ భవనం కొరకు రూ.3లక్షలు మంజూరు చేశారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా నియోజకవర్గం తరపున ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశానికి పల్లెలు పట్టు కొమ్మలు అని అందుకే ఎంపీ ధర్మపురి అరవింద్ గ్రామాల అభివృద్ధికి కట్టుబడి ఉన్నారని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం మోసపూరిత హామీలు ఇచ్చి మాటలు చెబుతూ పబ్బం గడుపుతుందని ఆరోపించారు. రానున్న స్థానిక ఎన్నికలలో బీజేపీ పార్టీ జడ్పీ చైర్మన్‌లతో పాటు జడ్పీటీసీలు, ఎంపీపీలు కైవసం చేసుకుంటామన్నారు. బోధన్ నియోజకవర్గంలో కార్యకర్తలు ఐక్యమత్యంతో ఉంటూ వచ్చే ఎన్నికలలో పార్టీ అభ్యర్థుల గెలుపునకు ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు. కార్యకర్తలు ఎన్నికలలో సైనికులుగా పని చేయడానికి సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ పార్టీ మోసపూరిత వాగ్దానాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. అలాగే బీజేపీ చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు తెలియజేసేలా ప్రణాళికలు చేపట్టాలన్నారు. రాంపూర్ గ్రామంలో మహిళ భవనం పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా రాంపూర్‌లో మాట్లాడుతూ మహిళల సంక్షేమమే బీజేపీ ధ్యేయమన్నారు. మహిళలు ఆర్థికంగా, రాజకీయంగా అన్ని రంగాలలో రాణించాలన్నారు. ఈ కార్యక్రమంలో అసెంబ్లీ కన్వీనర్ కూరెళ్ల శ్రీధర్, బోధన్ మండల బీజేపీ అధ్యక్షులు సిర్ప సుదర్శన్, పట్టణ అధ్యక్షులు పసులోటి గోపికిషన్, సాలూర మండల అధ్యక్షులు రావుబా గంగాధర్, మండల ప్రధాన కార్యదర్శులు వెంకటేష్, లక్ష్మారెడ్డి, సౌందర్య కిరణ్, మాజీ అధ్యక్షులు మనోహర్, జీలకరి ప్రవీణ్, మాజీ సర్పంచ్ సిర్ప మంజుల, మాజీ ఎంపీటీసీ లక్ష్మి రాజన్న, సీనియర్ నాయకులు భాస్కర్ రెడ్డి, న్యాలం శ్రీనివాస్, వివిధ గ్రామాల అభివృద్ధి కమిటీ సభ్యులు, శక్తికేంద్రం ఇన్‌చార్జులు, బూత్ అధ్యక్షులు, కార్యకర్తలు, గ్రామస్థులు, మహిళలు, యువకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ప్రతీ ఒక్కరు ధ్యానంతోనే సంపూర్ణ ఆరోగ్యం



మాట్లాడుతున్న బాలయోగి రాములు మహారాజ్

ఆర్మూర్, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): ప్రతీ ఒక్కరు నిత్యం ధ్యానం చేస్తు అనంతమైన శక్తిని, సంపూర్ణ ఆరోగ్యం పొందాలని నందిపేట కేధారేశ్వర ఆశ్రమ వ్యవస్థాపకులు బాలయోగి రాములు మహారాజ్ అన్నారు. ఆదివారం ఆర్మూర్ మండలం ఇస్సాపల్లి గ్రామంలో పీఎస్ఎస్ఎం ఆధ్వర్యంలో ధ్యాన జ్ఞాన కార్యక్రమం, అహింసాయుత మహకరుణ శాకాహార ర్యాలీని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జ్ఞానదాతగా హాజరైన రాములు మహారాజ్ మాట్లాడుతూ సాధన చేస్తే సాధించలేనిది ఏది లేదని, సాధన వల్ల అనేకమార్గాలు దొరుకుతాయని ముక్తిమార్గం శక్తిమార్గం ధ్యాన సాధన అన్నారు. ప్రతీ ఒక్కరు శాకాహారం భుజిస్తు సనాతన ధర్మాన్ని పరిరక్షిస్తు ముందుకు సాగాలన్నారు.అనంతరం గ్రామంలో శాకాహార ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్ర మంలో పీఎస్ఎస్ఎం జిల్లా అధ్యక్షుడు సాయికృష్ణారెడ్డి, శ్రీ వెంకటేశ్వర ఆలయ కమిటి చైర్మన్ ఇస్సాపల్లి రాజారెడ్డి, డాక్టర్ అమరవాజీ శ్రీనివాస్, ఉమ్మడి చిన్నయ్య, సుదర్శన్, బోదెపల్లి రాజు, ప్రశాంత్‌రెడ్డి, చిన్నయ్య, తదితరులు పాల్గొన్నారు.

11, 12నమహిళల, పురుషుల సీనియర్ బేస్‌బాల్ జట్ల ఎంపిక

డిచ్‌పల్లి, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): ఈనెల 11న సీనియర్ మహిళల నిజామాబాద్ జిల్లా జట్ల ఎంపిక ఉదయం 11గంటలకు సాంఘిక సంక్షేమ సుద్దపల్లి క్రీడాపాఠశాలలో, 12న సీనియర్ పురుషుల జిల్లా జట్ల ఎంపిక 10గంటలకు ఆర్మూర్ క్రీడా మైదానంలో ఎంపిక జరుగుతున్నట్లు జిల్లా బేస్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు మధు సూదన్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి వినోద్ తెలిపారు. ఈ పోటీలో పాల్గొనే క్రీడాకారులు జిల్లా కోచ్‌లు నరేష్, మౌనిక,జ్యోత్స్న, నర్మదలకు రిపోర్ట్ చేయాలని వారు పేర్కొన్నారు.

సాలూర ఎత్తిపోతల పథకం చైర్మన్‌గా శివకాంత్ పటేల్

సాలూర,ఆగస్టు10(ఆంధ్రజ్యోతి): సాలూర ఎత్తిపోతల పథకం చైర్మన్‌గా సాలూర మండల కేంద్రానికి చెందిన శివకాంత్ పటేల్‌ను రైతులు, గ్రామస్థులు ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సాలూర మండల కేంద్రంలోని మండల ప్రజాపరిషత్ కార్యాలయం ఆవరణలో ఆదివారం ఏర్పాటు చేసిన రైతులు, గ్రామ పెద్దల సమక్షంలో కమిటిని ఎన్నుకున్నారు. ఆరు నెలల నుంచి ఎత్తిపోతల పథకానికి నిధులు లేకపోవడంతో ఎత్తిపోతల పథకం ప్రాంగణంలో పలు ఘటనలు చోటు చేసుకున్న విషయం అందరికి తెలసిందేనని గ్రామస్థులు తెలిపారు. ఈ సందర్భంగా నూతన కమిటీని ఆదివారం ఎన్నుకున్నారు. ఎత్తిపోతల పథకం అధ్యక్షులుగా శివకాంత్ పటేల్, వైస్ చైర్మన్ ఇల్తెపు సాయన్న, సెక్రెటరీగా డిస్కో సాయిలు, కోశాధికారిగా మామిడి శ్రీను, సభ్యులుగా గంగారాం, శ్రీకాంత్, భూమయ్య, ఖదీర్, లక్ష్మణ్, మల్లెపూల లక్ష్మణ్, నాగేష్, లక్ష్మణ్‌లు ఏకగ్రీవంగా కమిటీకి ఎన్నికయ్యారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ ఎత్తిపోతల పథకం ద్వారా సాగునీరు అందించడానికి కృషి చేస్తామన్నారు. ఎత్తిపోతల ద్వారా సాగునీరు అందించడానికి ప్రతి రైతు సహకారం అందించాల్సిందిగా కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామపెద్దలు, రైతులు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

నేడు ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి సాలూరకు రాక

సాలూర,ఆగస్టు10(ఆంధ్రజ్యోతి): బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి సోమవారం సాలూర మండల కేంద్రానికి వస్తున్నారని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మందర్నా రవి తెలిపారు. మందర్నా, హున్స గ్రామాలలో పర్యటించనున్నట్లు వెల్లడించారు.పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేపడతారని పేర్కొన్నారు. హున్స, మందర్నా, ఖాజాపూర్ రైతులతో ముఖాముఖి కార్యక్రమం ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. ఉదయం 9గంటలకు మందర్నా గ్రామంలో అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేయనున్నట్లు తెలిపారు. కావున మండల కార్యకర్తలు నాయకులు పాల్గొనాలన్నారు.

వధూవరులను ఆశీర్వదించిన బోధన్ ఎమ్మెల్యే

నవీపేట,ఆగస్టు10(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని రఘుపతి రెడ్డి గార్డెన్స్‌లో ఆదివారం జరిగిన వివాహ వేడుకలో నూతన వధూవరులను బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి ఆశీర్వదించారు. మండలంలోని నాగేపూర్‌కు చెందిన రాంరెడ్డి కుమారుడు సతీష్ వివాహం జరుగగా నూతనంగా వధువరులను ఎమ్మెల్యే ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు మానాల మోహన్ రెడ్డి, శ్రీనివాస్ గౌడ్, లక్ష్మినారాయణ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

చర్చిలో మ్యారేజ్ సండే సందడి



చర్చిలో మ్యారేజ్ సండే దృశ్యం

బోధన్,ఆగస్టు10(ఆంధ్రజ్యోతి): బోధన్ పట్టణంలోని రాకాసిపేట్ అలిట్రినిటి చర్చిలో ఆదివారం మ్యారేజ్ సండే కార్యక్రమాన్ని నిర్వహించారు. మెదక్ డయాస్‌ఇన్ సీఎస్ఐ ఆధ్వర్యంలో సంఘంలోని వివాహం అయిన జంటలు పూలదండలు, ఆంక్షిలు వేసుకుని వివాహన్ని తలపించేలా కార్యక్రమాన్ని నిర్వహించారు. దీంతో చర్చిలో మ్యారేజ్ సండే సందడిగామారింది. ఈ సందర్భంగా చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రెసిడిటర్ ఇన్‌చార్జి రెవరెండ్ కె.రుబెన్, రెవరెండ్ పీ.ప్రకాష్ జంటలను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో చర్చి పెద్దలు, సంఘం పెద్దలు, వివాహం అయిన జంటలు, యువకులు మహిళలు, తదితరులు పాల్గొన్నారు.

గౌడ సంఘాలకు సర్వాయి పాపన్నగౌడ్ జయంతి ఆహ్వానం



సర్దార్ పాపన్న జయంతి ఉత్సవాల ఆహ్వాన పత్రిక అందజేస్తున్న గౌడ యువసేన సభ్యులు

మోర్తాడ్, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): బడుగు బలహీన వర్గాల ఆశజ్యోతి, గోల్కొండ కోటను ఏలిన సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ జయంతికి తరలి రావాలని ఆర్మూర్ డివిజన్ నాయకులు కోరారు. ఆదివారం మండల కేంద్రంలోని గౌడ సంఘ సభ్యులను కలిసి ఆహ్వాన పత్రికలను అందజేశారు. ఈనెల 17న పెర్కిట్ శివారులోని తిరుమల ఫంక్షన్ హాల్‌లో భారీ ఎత్తున జరిగే జయంతి కార్యక్రమంలో పాల్గొనాలని వారు కోరారు.ఈ కార్యక్రమంలో జిల్లాగౌడయువసేనా సంఘసభ్యులు, మోర్తాడ్ గౌడసంఘ సభ్యులు పాల్గొన్నారు.

ఆలూర్:మండలంలోనిగౌడ్ యువసేనాఆధ్వర్యంలో ఆగస్టు17న జరుగబోయే సర్దార్ సర్వాయి పాపన్న జయంతి ఉత్సవాలు ఉన్నందున దేగాంగౌడ సంఘానికి ఆహ్వానపత్రిక ఆదివారం అం దజేశారు.ఈకార్యక్రమంలో ఆలూర్ గౌడ యువసేన అధ్యక్షుడు అర్జున్‌గౌడ్, ఉపా ధ్యక్షుడు మనీష్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి సాయికృష్ణగౌడ్, గ్రామాలఅధ్యక్షులు పాల్గొన్నారు.

పాలిటెక్నిక్ కళాశాలలో ప్రవేశాల కోసం దరఖాస్తులు

కోటగిరి,ఆగస్టు10(ఆంధ్రజ్యోతి):మండల కేంద్రంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో తక్షణ ప్రవేశాలకై అవకాశం కల్పిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ సుధాకర్ తెలిపారు. కళాశాలలో ఎలక్ట్రికల్, మెకానికల్ ఇంజనీరింగ్ కోర్సులలో సీట్లు ఖాళీగా ఉన్నాయన్నారు. పదో తరగతి పాసై ఆసక్తి గల విద్యార్థులు తమ ఒరిజినల్ సర్టిఫికేట్లతో పాటు ఫీజు రూ.6500 తీసుకుని సోమవారం కళాశాలలో సంప్రదించాలని ఆయన సూచించారు.ఈఅవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఆయనకోరారు.

నేడు నల్లవెల్లికి ఎమ్మెల్యే భూపతి రెడ్డి రాక

ఇందల్వాయి, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి):మండలంలోని నల్లవెల్లి గ్రామానికి రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతి రెడ్డి సోమవారం రానున్నారు. సొసైటీ నిధులతో నిర్మించిన నూతన సొసైటీ భవనాన్ని ఎమ్మెల్యే ప్రారంభించనున్నారు. ఈ కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో ప్రజలు వచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సొసైటీ చైర్మెన్ నోముల శ్రీనివాస్ రెడ్డి కోరారు.

నాగలింగేశ్వర ఆలయంలో విగ్రహాల ప్రతిష్ఠాపన



విగ్రహాలను పాలతో శుద్ధి చేస్తున్న ఆలయ కమిటీసభ్యులు

ఆర్మూర్‌టౌన్,ఆగస్టు10(ఆంధ్రజ్యోతి):పట్టణంలోని నాగలింగేశ్వర ఆలయంలో ఆలయకమిటీ ఆధ్వర్యంలో అంగరంగా వైభవంగా దేవతా మూర్తుల విగ్రహాల ప్రతిష్ఠాపన కార్యక్రమం నిర్వహించారు. ఆదివారం ఆలయంలోని గణపతి,సుబ్రహ్మణ్యేశ్వర స్వామి,జంట నాగుల విగ్రహాలను మంత్రోచ్చార ణలతో ప్రతిష్ఠా పనకార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు సత్యశ్రీనివాస్,అంబికారమేష్, రాజయ్యకలిగోట గంగాధర్,జీవినర్సింహా రెడ్డి,బా లాజీ,రెడ్డి ప్రకాష్, బండి బాబు, నారాయణ, అజయ్,రాజు,విజయానంద్‌లతో పాటు గ్రామస్థులు,మహిళలు,యువకులు పాల్గొన్నారు.

స్నేహితుడి కుటుంబానికి ఆర్థిక సహాయం

సిరికొండ, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి):రావుట్ల గ్రామానికి చెందిన జాగర్ల నరహరి ఇటీవల మరణించడంతో ఆయన కుటుంబాన్ని ఆదుకోవడానికి 10వ తరగతి సహచర విద్యార్థులు 50వేల ఆర్థిక సహాయాన్ని అందించారు. ఆయనకు ఇద్దరు కుమారుల చదువుల కోసం 1999-2000 ఎస్సెస్సీ బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు రావుట్ల గ్రామానికి వచ్చి 50వేల ఆర్థిక సహాయిన్న పిల్లలకు అందించారు.

నేడు రాఘవేంద్రస్వామి 354వ ఆరాధన ఉత్సవం

నిజామాబాద్ కల్చరల్, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి):తన 16వ యేటనే సన్యాసత్వాన్ని స్వీకరించి హిందూధర్మాన్ని భారతదేశ నలుమూలల విస్తరింపజేసిన గురు రాఘవేంద్ర స్వామి 354వ ఆరాధనోత్సవం సోమవారం నిర్వహించనున్నారు. ప్రతియేటా శ్రావణ పౌర్ణమి రెండవ రోజున ఆరాధన ఉత్సవాన్ని జరపడం ఆనవాయితీగా వస్తుంది. మధ్వ సాంప్రదాయాన్ని అనుసరించి రాఘవేంద్రస్వామి బృంధావన సన్నిదానాల్లో ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు.ఈరోజున రాఘవేంద్రస్వామి సజీవంగా బృంధావనంలో సమాధిగా ప్రవేశించిన రోజుగాశాసనం ద్వారా తెలుస్తుంది. సుమారు 700 సంవత్సరాల పాటు రాఘవేంద్రస్వామి సజీవ సమాధి రూపంలోనే భక్తులకు దర్శనమిస్తారు. ప్రహల్లాద స్వరూపంగా రాఘవేంద్రస్వామిని భక్తులు పూజిస్తారు. 1621 నుండి 1671 వరకు మధ్వా చార్య స్థాపించిన మఠానికి అధిపతిగా పనిచేశారు. జీవితకాలంలో ఎన్నో అద్భుతాలను చేసి మధ్వాచారి బోధనలపై అనేక భజనలు, రచనలు చేసి ప్రజలను ఆధ్యాత్మిక చైత న్యవంతులను చేశారు. రాఘవేంద్రస్వామి ఆరాధన ఉత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా వ్యాప్తంగా రాఘవేంద్రస్వామి బృంధావన సన్నిదానంలో ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు.

రైతు బీమాకు నూతన మార్గదర్శకాలు

కోటగిరి,ఆగస్టు10(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం రైతుబీమాకు నూతన మార్గదర్శకాలు జారీ చేసిందని మండల వ్యవసాయ అధికారి రాజు తెలిపారు. 2025పాలసీ సీజన్ కోసం ఈ సంవత్సరం జూన్ 5వరకు కొత్త పాస్ పుస్తకాలు పొందిన రైతులు ఈ నెల 13వ తేది లోపు వ్యవసాయ విస్తరణ అధికారి వద్ద నమోదు చేసుకోవాలని కోరారు. పాలసీ కాలం ఈ నెల 14నుంచి 2026ఆగస్టు 13తో ముగుస్తుందన్నారు. వయసు పరిమితి 18ఏళ్ల నుంచి గరిష్ఠంగా 59ఏళ్లు ఉండాలన్నారు. 14ఆగస్టు 1966 నుంచి 14ఆగస్టు 2007మధ్యలో జన్మించిన రైతులు మాత్రమే బీమాకు అర్హులన్నారు.

ప్రతీ రైతు బీమాను సద్వినియోగం చేసుకోవాలి

సాలూర,ఆగస్టు10(ఆంధ్రజ్యోతి): ప్రతి రైతు రైతు బీమాను సద్వినియోగం చేసుకోవాలని సాలూర మండల వ్యవసాయ శాఖ అధికారి శ్వేత ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.ఈనెల 13వ తేది వరకు రైతుబీమా చేసుకోవడానికి అవకాశం ఉందని, అర్హులైన వారందరు రైతు బీమా సద్వినియోగం చేసుకోవాలన్నారు. కొత్త పట్టాదారు రైతుకు జూన్ 5వరకు పట్టాపాస్ బుక్ వచ్చిన వారికి ఇంత వరకు రైతు బీమా చేసుకోని రైతులు మాత్రమే రైతు బీమా చేసుకోవాలని సూచించారు. దరఖాస్తు ఫారం, రైతు పట్టాదారు పాస్‌బుక్, జిరాక్స్ తహసీల్దార్‌తో సంతకం చేయబడిన డీఎస్ ఫారం, రైతు ఆధార్ కార్డు జిరాక్స్, నామిని ఆధార్ జిరాక్స్ సమర్పించాలని తెలిపారు.ఆగస్టు 14,1966 నుంచి ఆగస్టు2007మధ్యలో పుట్టినరైతులుమాత్రమే ఈరైతుబీమాకుఅర్హులనిపేర్కొన్నారు.ఆధార్‌కార్డులో 18సంవత్సరాల నుంచి 59సంవత్సరాల వయసు ఉన్న రైతులు మాత్రమే బీమా చేసుకోవాల్సిందిగా వెల్లడించారు.

విద్యుత్ సమస్యలను పరిష్కరించాలని రైతుల ధర్నా



ధర్నా చేపడుతున్న రైతులు

ఆర్మూర్‌టౌన్, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ పరిధిలోని మామిడిపల్లిలో విద్యుత్ సమస్యలను పరిష్కరించాలని రైతులు ధర్నా చేపట్టారు. పంట భూముల్లో విద్యుత్ తీగలు కిందికి వేలాడడంతో పాటు పలు సమస్యలు ఉండడంతో సరియైన లైన్‌మెన్‌లు లేకపోవడంతో రైతులకు తీవ్రసమస్యలు అవుతున్నాయని తక్షణమే ఉన్నతాధికారులు స్పందించి రైతుల సమస్యలను పరిష్కరించాలని వారుకోరారు. ఈకార్యక్రమంలో రైతులు తవ్వన్న, నర్సారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

విద్యానగర్ కాలనీలో శ్రమదానం



శ్రమదానం చేస్తున్న స్వచ్ఛంద సేవా సంస్థ సభ్యులు

ఆర్మూర్,ఆగస్టు10(ఆంధ్రజ్యోతి):ఆర్మూర్ పట్టణంలోని విద్యానగర్ కాలనీ కమ్యూనిటీ హాల్ సమీపంలో ఆదివారం మహాత్మ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో శ్రమ దానం నిర్వహించారు. కమ్యూనిటీ ఆవరణ, పరిసరాల్లో పెరిగిన పిచ్చిమొక్కలు,ముళ్లపొదలను తొలగించి శుభ్రం చేశారు.కాలనీలో కచ్చ డ్రైనేజీలో నీరు నిల్వకుండా చెత్త చెదారం తొల గించి శుభ్రం చేశారు.ఈకార్యక్రమంలో స్వ చ్ఛంద సంస్థ వ్యవస్థాపకులు సుంకె శ్రీనివాస్, కాలనీ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు ఉమ్మెడ సాయన్న, సంస్థసభ్యులు సుంకె నిశాంత్, మ ధుసుధన్, గణేష్, నరేందర్, రాజ్‌కుమార్, భోజన్న, ఎల్లయ్య, ఆదిత్య, శ్యాంసుందర్ పాల్గొ న్నారు.

బహుళజాతి కంపెనీలు భారతదేశం వీడాలి



మాట్లాడుతున్న ఎస్‌కేఎం నాయకులు

మోపాల్, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): భారతదేశ ఆర్థిక వనరులను దోపిడి చేస్తూ వ్యవసాయ రంగాన్ని పట్టిపీడిస్తున్న బహుళజాతి సంస్థలు భారతదేశాన్ని వీడాలని సంయుక్త కిసాన్ మోర్చ జిల్లా కన్వీనర్ వేల్పూర్ భూమయ్య అన్నారు. ఆదివారం మోపాల్ మండలంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ బహుళజాతి కంపెనీలు 20వేలకు పైగా భారతదేశంలో విస్తరించి కార్మికులను వ్యవసాయ రంగాన్ని తమ పెట్టుబడిదారి వ్యవస్థతో పీడిస్తున్నాయని అన్నారు. అన్ని వర్గాల ప్రజలు కష్టాలు ఎదుర్కోవాల్సిన పరిస్థితి వచ్చిందన్నారు. దేశవ్యాప్తంగా బహుళజాతి సంస్థలకు వ్యతిరేకంగా ఈనెల 13న చేపట్టనున్న నిరసన కార్యక్రమాల్లో రైతులు, కార్మికులు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈకార్యక్రమంలో సహాయ కార్యదర్శి చిన్నయ్యనర్సయ్య, శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

కొండూర్‌లో ఎల్లమ్మ ఆలయ నిర్మాణానికి భూమిపూజ



భూమిపూజ చేస్తున్న గౌడ సంఘం సభ్యులు

సిరికొండ, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొండూర్ గ్రామంలో రేణుక ఎల్లమ్మమాత ఆలయ నిర్మాణానికి ఆదివారం నాడు గౌడ సంఘం సభ్యు లు భూమిపూజ నిర్వహించారు. ఆలయ నిర్మాణానికి ఆర్థిక సహాయం చేసుకొని భూమిపూజకు పూనుకున్నారు. ఎంపీ, స్థానిక ఎమ్మెల్యేలు కలిసి ఆలయ నిర్మాణానికి సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఆలయాన్ని త్వరగా నిర్మించుకొని ఎల్లమ్మ దేవి ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తామని వారు తెలిపారు.

రైతు బీమా కోసం దరఖాస్తు చేసుకోవాలి

నెట్‌వర్క్, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): డొంకేశ్వర్ మండలంలోని వివిధ గ్రామాల రైతులు రైతుబీమా కోసం తప్పనిసరి దరఖాస్తు చేసుకోవాలని డొంకేశ్వర్,మాక్లూర్,వేల్పూర్, ముప్కాల్,డిచ్‌పల్లి, ఇందల్వాయి,సాలూరా మండల వ్యవసా యాధికారి మధుసూదన్ ,పద్మ,శృతి,లావణ్య,రూపేష్, రమాకాంత్ తెలిపారు. జూన్ ఐదు వరకు కొత్త పట్టా పాస్‌బుక్ వచ్చి ఇప్ప టి వరకు దరఖాస్తు చేసుకోని రైతులు బీమా కోసం దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఆధార్ కార్డులో 18 సంవత్సరాల నుంచి 59 సంవత్సరాలు వయస్సు ఉన్న రైతులు మా త్రమే బీమాకు అర్హులని అన్నారు. రైతుబీమా దరఖాస్తు కోసం ఆధార్‌కార్డు, నామిని ఆధార్, పట్టాదారు పాస్‌బుక్ జిరాక్స్, దరఖాస్తు ఫారంతో జతచేసి ఆగస్టు 13వ తేదీ వరకు మండల వ్యవసాయాధికారి కార్యాలయంలో అందజేయాలని అన్నారు.



శిథిలావస్థకు చేరిన ధర్మారం(బి) - మదన్‌పల్లి వంతెన

శిథిలావస్థలో మినీ వంతెన

ప్రమాదకరంగా ధర్మారం(బి) - మదన్‌పల్లి మినీ వంతెన

డిచ్‌పల్లి, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): డిచ్‌పల్లి మండలంలోని ధర్మారం(బి)-మదన్‌పల్లి గ్రామాలకు వెళ్లే మినీ వంతెన పూర్తిగా శిథిలావస్థకు చేరుకుంది. ఈ వంతెన చుట్టూ చెట్లు మొలకెత్తడంతో పాటు రోడ్డుపైనే గుంతలు పడటంతో కంకర కుప్పలు వంతెనపై కనిపిస్తున్నాయి. ఈ వంతెన గుండా ధర్మారం, మదన్‌పల్లి, అమ్రాజ్, మానిక్‌బండార్ వెళ్లే వాహనాలు అధికం కావడంతో వంతెనతో పాటు రోడ్డు కూడా గుంతలమయంగా మారింది. రోడ్డుపై అడుగుకు ఒక్క గుంత పడటంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఆర్అండ్‌బీ అధికారులు శిథిలావస్థకు చేరిన వంతెనను వెంటనే మరమ్మతులు చేసి రోడ్డుపై ఏర్పడిన గుంతలను మరమ్మతులు చేయాలని కోరుతున్నారు.



వంతెన పక్కనే గుంతలు పడిన రోడ్డు

బజరంగ్ దళ్ ఆధ్వర్యంలో అన్నప్రసాదం



అన్నప్రసాదం చేస్తున్న బజరంగ్ దళ్ సభ్యులు

మోస్రా, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): బోధన్ మండలం కల్దుర్కి గ్రామం నుంచి బోధన్, మోస్రా మండలాల మీదుగా మల్లారం గ్రామ శివారులోని అటవీ ప్రాంతంలో గల పిట్లకృష్ణ మహరాజ్ మఠం శివాలయం వద్దకు దాదాపు 40కిలో మీటర్లు పాదయాత్ర చేస్తూ భజన, సంకీర్తనలతో వెళుతున్న భక్తులకు మోస్రా మండలం విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో అన్నప్రసాదం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గత పది సంవత్సరాల నుండి ప్రతి సంవత్సరం పాదయాత్ర భక్తులకు విశ్వహిందూ పరిషత్, బజరంగ్ దళ్ ఆధ్వర్యంలో అన్నప్రసాదం సేవా చేయడం చాలా సంతోషంగా ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కల్దుర్కి గ్రామ భక్తులు, మండల విశ్వహిందూ పరిషత్ సభ్యులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న విశ్వహిందూ పరిషత్ సభ్యులు

ఘనంగా అన్నబాహు సాటే జయంతి

కుంటాల, ఆగస్టు, 10: (ఆంధ్రజ్యోతి): నిర్మల్ జిల్లా కుంటాల మండలంలోని లింబా (కే) గ్రామంలో ఆదివారం అన్నబాహు సాటే జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అన్నబాహు సాటే విగ్రహానికి పూలమాల వేసి ఆయన అడుగుజాడల్లో ప్రతి ఒక్కరూ నడుచుకోవాలని మాజీ సర్పంచ్ సవ్వి అశోక్ రెడ్డి, ఆనంద్ రావు పటేల్‌లు అన్నారు. అనంతరం పద్మశ్రీ అవార్డు గ్రహీత మంద కృష్ణ మాదిగ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు.



లింబా (కే)లో అన్నబావు సాటే జయంతిలో పాల్గొన్న గ్రామస్థులు

గురువులకు వందనం..

● సొంత ఖర్చులతో పాఠశాలలకు రంగులు ● విద్యార్థులకు టై, బెల్టుల పంపిణీ ● విద్యార్థుల సంఖ్య పెంచేందుకు ఉపాధ్యాయుల కృషి

పెద్ద కొడప్‌గల్, ఆగష్టు 10 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేసే ఉపాధ్యాయులంటే పాఠశాలకు వచ్చి పాఠాలు బోధించి ఇంటికి వెలుతారని, తమ వేతనంలో ఒక్క రూపాయి ఖర్చు చేయడానికి వెనకాడుతుంటారని ప్రచారం ఉంటుంది. పాఠశాలలో ఏ అవసరం ఉన్న పై నుంచి మంజూరు వస్తేనే అభివృద్ధి చేస్తారని నానుడి ఉండేది. అయితే ఇదంతా ఒకప్పటి మాట. ఇప్పటి తరం ఉపాధ్యాయులు తాము బోధిస్తున్న పాఠశాలల్లో కావాల్సిన మౌళిక అవసరాలను తామే తీర్చుకుంటూ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచేందుకు కృషి చేస్తున్నారు ఈ ఉపాధ్యాయులు. పెద్ద కొడప్‌గల్





మండలంలోని బేగంపూర్ తండా, టికారం తండా, పిట్లం మండలంలోని పారడ్‌పల్లి తండాలకు చెందిన ఉపాధ్యాయులకు ఈ కోవలోకే వస్తారు. గత విద్యా సంవత్సరం నూతన డీస్సీ ద్వారా ఎంపికైన పారడ్‌పల్లి, టికారం తాండ ఉపాధ్యాయులతో పాటు, బేగంపూర్ పాఠశాలకు చెందిన సీనియర్ ఉపాధ్యాయురాలు తమ స్వంత ఖర్చులతో పాఠశాలలకు అందంగా రంగుల వేయించారు. పాఠశాల తరగతి గదులు ఉన్నా అవి ఆకర్షనీయంగా లేకపోవడం విద్యార్థులు పాఠశాలకు రావాలంటే మంచి వాతావరణం ఉండాలన్న తలంపుతో వేలాది రూపాయలు ఖర్చు చేసి పాఠశాల తరగతి గోడలకు రంగులు వేయించారు. దీంతో పాటుగానే తరగతి గోడలకు దేశ నాయకుల చిత్రపటాలు, అంకెలు, వర్ణమాల. ఎక్కాలు, పక్షుల, జంతువుల, దేశ, తెలంగాణ రాష్ట్ర తదితర చిత్రాలు వేయించారు. దీంతో తరగతి గోడలపై ఆకర్షణీయ చిత్రాలు ఉండటంతో విద్యార్థులు వీటిని చూసుకుంటూ ఉత్సాహంగా పాఠశాలకు రావడానికి ఆసక్తి చూపుతున్నారని ఉపాధ్యాయులు తెలిపారు.

రూ. 20 వేలు ఖర్చుపెట్టి రంగులు వేయించాం..

నేను గత సంవత్సరం డీఎస్సీలో ఇక్కడ ఉపాధ్యాయురాలిగా పోస్టింగ్ పొందాను. పాఠశాలకు రాగానే పాఠశాల పరిస్థితులు చూసి దీనిని కొత్తగా విద్యార్థులకు చూపెట్టాలన్న తలంపుతో సుమారుగా 20 వేల రూపాయలు ఖర్చుపెట్టి రంగులు వేయించడంతో పాటు పలు రకాల చార్ట్‌లు ఏర్పాటు చేయించా. పాఠశాల వాతావరణం బాగుండటంతో పిల్లలు ఉత్సాహంగా బడికి వస్తున్నారు.

:ప్రవళిక ఉపాధ్యాయురాలు పారడ్‌పల్లి తండా



ప్రస్తుతం 42 మంది విద్యార్థులు ఉన్నారు..

పాఠశాలలో విద్యార్థులకు మంచి విద్యను అందిస్తున్నాం. మా తపను గుర్తించిన తండా వాసులు తమ పిల్లలను ప్రయివేట్ పాఠశాలలకు పంపకుండా మా పాఠశాలకు పంపుతున్నారు. గతంలో మా పాఠశాలలో 24 మంది విద్యార్థులు ఉండగా, ప్రస్తుతం 42 మంది విద్యార్థులు వస్తున్నారు.

: ప్రకాష్ ప్రధానోపాధ్యాయుడు, టికారం తండా



రాఖీతో ఆర్టీసీకి అదనపు ఆదాయం

భైంసా, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): రక్షా బంధన్ వేడుకలతో ఆర్టీసీకి అధనపు ఆదాయం సమకూరింది. పర్వదిన వేడుకలను పురస్కరించుకొని రాఖీలు కట్టేందుకు గాను సోదరీమణులు సోదరుల వద్దకు, సోదరులు సోదరీమణుల దగ్గరకు రాకపోకలు చేపట్టారు. ఈ క్రమంలో శనివారం నిర్మల్ జిల్లాలోని రెండు బస్సు డిపోలకు ఆధనపు చేకూరింది. భైంసా బస్ డిపోకు శనివారం రూ.6 లక్షల ఆధనపు ఆదాయం వచ్చినట్లుగా ఇక్కడి డిపో అధికారులు వెల్లడించారు. ఇక్కడి బస్సు డిపోకు రోజు సరాసరి రూ.15 లక్షల ఆదాయం సమకూరుతుంది. శనివారం రక్షా బంధన్ వేడుకలను పురస్కరించుకొని ప్రయాణీకు ల రాకపోకలు అధికంగా జరిగాయి. ఈ క్రమంలో రోజువారి ఆదాయం రూ.15 లక్షలు ఉండగా.. శనివారం అధనంగా రూ.6 లక్షల ఆదాయం సమకూరి మొత్తం రూ.21 లక్షల ఆదాయం చేకూరింది. భైంసా బస్సు డిపో పరిధి లో 47 అద్దె బస్సులు, 28 సంస్థ బస్సులు కలిపి మొత్తం 75 బస్సులు ఉన్నాయి. నిత్యం సంబంధిత బస్సులు ద్వారా 25రూట్లలో సుమారు 28,500 కి.మీ. మేర రాకపోకలు జరుగుతాయి. శనివారం ప్రయాణీకుల రద్దీ దృష్ట్యా అదనపు ట్రిప్పుల వల్ల ఇక్కడి బస్సులు 30,800 కిలోమీటర్ల మేర రాకపోకలు చేపట్టాయి. తద్వారా రూ.6లక్షల అదనపు ఆదాయం సమకూరింది.

రైతు బీమా దరఖాస్తుకు 3 రోజులే గడువు

భైంసా, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): అన్నదాత కుటుంబానికి ఆర్థిక భరోసా కల్పిస్తున్న రైతు బీమా పథకానికి అర్హత కలిగిన రైతుల నుంచి దరఖాస్తు స్వీకరణ ప్రక్రియకు ప్రభుత్వం ఉపక్రమించింది. ఇందుకు సంబంధించి శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. అర్హతలు కలిగిన రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరించాలని వ్యవసాయశాఖ అధికారులకు ఆదేశాలు జారీ చేసింది. ఈ నెల13 లోగా దరఖాస్తులు స్వీకరణ ప్రక్రియ పూర్తి చేసి యాప్‌లో వాటి నమోదును పూర్తి చేయాలని ఉత్తర్వులో పేర్కొన్నారు.

● అర్హులు వీరే..

రైతు బీమా పథకానికి దరఖాస్తు చేసుకునేందుకు ప్రభుత్వం అర్హతలను జారీ చేసింది. 1966 ఆగస్టు 14 నుంచి 2007 ఆగస్టు 14 మధ్య కాలంలో జన్మించిన వారు దరఖాస్తుకు అర్హులుగా పేర్కొంది. ప్రస్తుత సంవత్సరం జూన్ 5 లోపు పట్టాదారు పాసు పుస్తకం పొందిన లేని పక్షంలో తహసీల్దార్ వద్ద డిజిటల్ సిగ్నేచర్ పూర్తి చేసుకున్న రైతులు బీమా కోసం దరఖాస్తు చేసుకోవచ్చునని ఉత్తర్వులో వివరించారు. పట్టాదారు పుస్తకం లేదా డిజిటల్ సిగ్నేచర్ పత్రం, ఆధారు కార్డు, నామినీ ఆధారుకార్డు, బ్యాంక్ ఖాతా వివరాలను సంబంధిత ఏఈవోలకు అందచేసి రైతు బీమాకు దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుందని ఉత్తర్వులు తెలిపింది. ఇప్పటికే నమోదు చేసుకున్న రైతులు ఏవైనా సవరణలుంటే ఈ నెల 12 లోగా వ్యవసాయాధికారులను సంప్రదించి పరిష్కరించుకోవాలని సూచించింది.

చేతిలోనే సమస్త సమాచారం

» స్మార్ట్ ఫోన్ ఉంటే కూర్చున్న చోటే క్షణాల్లో వివరాలు

» అందుబాటులో రైల్‌వన్ యూటీఎస్ యాప్‌లు

» రైల్వే సమాచారం కోసం ఎటు వెళ్లాల్సిన అవసరం లేదు

కోటగిరి, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): భారతీయ రైల్వే ప్రయాణికులకు అధునాతక సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన సేవలు అందిస్తోంది. ఇందులో భాగంగా ట్రైన్‌లో ప్రయాణించాల్సిన వ్యక్తి ఇక నుంచి రైల్వే సేవలకు అటు ఇటు వెళ్లాల్సిన పని లేదు. కావాల్సిన సమాచారం అంత కూర్చున్న చోటు నుంచే తెలుసుకునేలా రైల్వే శాఖ అనేక యాప్‌లను అందుబాటులోకి తీసుకువచ్చింది. వీటిలో యుటీఎస్, రైల్ వన్ యాప్‌ల ద్వారా ప్రయాణికులు క్షణాల్లో మెరుగైన సేవలు అందుతాయి. దీనికి కావాల్సింది చేతిలో స్మార్ట్‌ఫోన్ మాత్రమే. ఈ క్రమంలో ఈ రైల్ యాప్‌లు ఎలాంటి సేవలనైనా అందిస్తాయి.

టికెట్‌కు ఇబ్బంది లేదు

యుటీఎస్ రైల్ వన్ యాప్‌ల నుంచి టికెట్‌లు బుకింగ్ చేసుకోవచ్చు. అంతే కాదు అత్యవసరంగా ఆన్ రిజర్వ్‌డ్ టికెట్ కూడా వెంటనే కొనుగోలు చేసే అవకాశం ఉంటుంది. ప్లాట్ ఫామ్ టికెట్ సైతం పొందవచ్చు. అలాగే యాప్‌ల ద్వారా సాధారణ టికెట్ బుకింగ్, ప్లాట్‌ఫామ్ టికెట్, నెలవారి టికెట్, క్యాన్సలేషన్, టికెట్ హిస్టరీ, బుకింగ్ టికెట్ సమాచారం, ఆర్ వాలెట్, టికెట్ ప్రొఫైల్, టికెట్ ట్రాన్‌జక్షన్, ట్రైన్ లైవ్ లోకేషన్ మొత్తం యాప్‌ల ద్వారా సులభంగా తెలుసుకునే అన్ని రకాల సౌకర్యాలు అందుబాటులోకి వచ్చాయి.

రైళ్ల కోసం

ఈ యాప్‌ల సేవలు అనేకం ఉన్నాయి. రైల్ ప్రయాణం చేయాలకునే వారు రైల్‌వన్, యూటీఎస్ యాప్‌ల ద్వారా వెళ్లాల్సిన ప్రాంతం, ఏ రైళ్లు అందబాటులో ఉన్నాయని వెతికేందుకు సెర్చ్ ట్రైన్స్ బటన్ ఉంటుంది. ఏ ప్లాట్‌ఫామ్‌పైకి వస్తుంది. కోచ్ పొజిషన్ ఎక్కడో ఉందో కూడా తెలుసుకోవచ్చు. రైల్ ఎక్కడ ఉంది. ఎప్పుడు వస్తుందని ట్రాక్ యువర్ ట్రైన్ ద్వారా తెలుసుకోవచ్చు.





రిజర్వేషన్ స్థితి

ఈ యాప్‌లో టికెట్ రిజర్వేషన్ స్థితిని తెలుసుకోవడానికి అవకాశం కల్పించారు. ముందస్తు రిజర్వేషన్ టికెట్స్ స్థితి, సీటు కన్ఫర్మేషన్, స్టేటస్ తెలుసుకోవచ్చు. రైలు, రిజర్వేషన్ రద్దు తదితర అంశాలను తెలుసుకోవచ్చు.

సీటు వద్దకు ఆహారం

రైలు ఎక్కగానే ప్రయాణికులు ఆహారం ఆర్డర్ చేసుకునే అవకాశం కల్పించారు. ఇండియన్ రైల్వే క్యాటరింగ్ అండ్ టూరిజం ద్వారా వివిధ రైల్వే స్టేషన్‌లకు చేరుకునేందుకు ముందే నచ్చిన ఆహరాన్ని ఆర్డర్ చేసుకుంటే రైళ్లో సీటు వద్దకు తీసుకువచ్చి ఇస్తారు.

సూచనలు, ఫిర్యాదులు

ఏమైన సూచనలు ఇవ్వాలనుకున్న, రైళ్లలో సమస్య తలెత్తిన ఫిర్యాదులు చేయడానికి రైల్ మద్దతు విభాగం అందుబాటులో ఉంది. ఇందులో ఫిర్యాదు చేస్తే సమస్యలు పరిష్కారం అవుతాయి. నిజామాబాద్ జిల్లా నుంచి నిత్యం సుమారు 40కి పైగా రైళ్లు రాకపోకలు సాగిస్తున్నాయి. వేలాది మంది ప్రయాణికులు రైల్వేలను ఆశ్రయిస్తున్నారు. ఫలితంగా లక్షలాది రూపాయల ఆదాయం సమకూరుతుంది.

డౌన్‌లోడ్ ఇలా చేసుకోవాలి

ఈ యాప్‌లను గూగుల్ ప్లేస్టోర్ నుంచి డౌన్‌లోడ్ చేయాలి. తర్వాత మొబైల్ నెంబర్ లేదా మెయిల్ ఐడీ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకుని పాస్‌వర్డ్ పెట్టుకోవడం ద్వారా ఉపయోగంలోకి వస్తుంది.

కోతుల బీభత్సం

బాన్సువాడలో వందల సంఖ్యలో వానర సంచారం

బెంబేలెత్తిపోతున్న పట్టణ వాసులు

చిన్నారులపై దాడి చేస్తున్న కోతులు పట్టించుకోని అధికారులు





బాన్సువాడలో కోతుల దాడిలో గాయపడ్డ చిన్నారి

బాన్సువాడటౌన్, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): బాన్సువాడ మున్సిపాలిటీ పరిధిలో కోతుల బీభత్సం పెను సమస్యగా మారింది. వందల సంఖ్యల్లో వానరాలు కాలనీల్లో స్వైరవిహారం చేస్తుండడంతో ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. ఇళ్లలో నుంచి బయటకు రావాలంటేనే జంకుతున్నారు. అడవులు తగ్గిపోవడం, ఆహారం దొరకకపోవడంతో కోతులు జనావాల్లోకి వచ్చి ఇక్కడే తిష్ఠ వేస్తున్నాయి. దీంతో ప్రజలు, రైతులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. అధికారులు చూస్తూ ఉంటున్నారే తప్ప కోతులను నివారించడానికి కనీస చర్యలు కూడా చేపట్టడం లేదని స్థానిక ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రజలపై కోతులు దాడులు చేస్తున్నా అధికారులు మాత్రం తమకేమి పట్టనట్లుగా వ్యవహరించడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తున్నాయి.

ఇళ్లలోకి చొరబడుతున్నాయి..

కోతులు ఇళ్లలోకి చొరబడి ఆహారపదార్థాలు, ఇతర వస్తువులను ఎత్తుకెళుతున్నాయి. ఒకవేళ అడ్డుకుంటే ప్రజలపై దాడులు చేస్తున్నాయి. బాన్సువాడ మున్సిపాలిటీ పరిధిలోని పాతబాన్సువాడ, శ్రీరామ కాలనీ, చైతన్యకాలనీ, శాంతినగర్ కాలనీ, భేతాళ స్వామి కాలనీ, టీచర్స్ కాలనీ, ఎస్బీవీస్ కాలనీ, హనుమాన్‌గల్లీ, గౌలిగూడ వంటి పలు కాలనీల్లో కోతుల సంచారం ఎక్కువగా ఉంది. కోతులు తరచూ ప్రజలు, చిన్నారులపై దాడులు చేస్తూ గాయపరుస్తున్నాయి. కొన్ని మందిరాలలోనైతే భక్తులకు ప్రదక్షిణలు చేయాలన్నా కోతులు భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి. ఇళ్ల పెంకులను పగలగొట్టి ఆస్తులను ధ్వంసం చేస్తున్నాయి. అంతే కాకుండా కరెంటు సర్వీసు వైర్లపై వేలాడుతూ వైర్లను తెంపేస్తున్నాయి. ఇదిలా ఉంటే గ్రామాల్లోని పంటపొలాల్లో మందలుగా వెళ్లి పంటలను నాశనం చేస్తున్నాయి. దీంతో రైతులు నష్టపోతున్నారు.

చిన్నారిపై కోతుల దాడి..

బాన్సువాడ మున్సిపాలిటీ పరిధిలోని గౌలిగూడలో చిన్నారి ఆరాధ్యపై శనివారం మధ్యాహ్నం కోతులు దాడి చేశాయి. దీంతో ఆ చిన్నారి తీవ్ర భయభ్రాంతులకు గురైంది. కుటుంబ సభ్యులు వెంటనే ఆ చిన్నారిని ఆస్పత్రికి తరలించి చికిత్సలు చేయించారు. ప్రమాదం ఏమి లేదని వైద్యులు చెప్పేసరికి చిన్నారి కుటుంబ సభ్యులు ఊపిరి పీల్చుకున్నారు. ఇలా ప్రతీచోట కోతులు ప్రజలపై దాడులు చేస్తున్నా అధికారులు మాత్రం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని ప్రజలు వాపోతున్నారు.

గంగపుత్ర ఉద్యోగుల సంక్షేమ సంఘం కార్యవర్గం



నూతన అధ్యక్షుడిని సన్మానిస్తున్న దృశ్యం

కామారెడ్డిటౌన్,ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): జిల్లా గంగపుత్ర ఉద్యోగుల సంక్షేమ సంఘంకార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా పీ.వెంకటి, ఉపాధ్యాక్షులుగా పోచయ్య, గంగాకిషన్, అనిల్‌కుమార్, రమేష్,సునిత, ప్రధానకార్యదర్శిగా శంకర్, సంయుక్త కార్యదర్శిగా ఎల్లెశం, నరేష్,శృతి, కోశాధికారిగా ప్రవీణ్‌కుమార్, కార్యనిర్వహణకార్యదర్శిగా గిర్మబోయి, గణేష్‌శ్రీకాంత్‌లతో కూడిన కార్యవర్గాన్ని ఏర్పాటుచేశారు. గంగపుత్రఉద్యోగుల సంక్షేమం, అభివృద్ధి కోరకు సామాజిక కార్యక్రమాలు చేపడుతామని తెలిపారు.అనంతరం ఉద్యోగాలలో ప్రమోషన్‌లు పొందినగంగపుత్ర కులసభ్యులను సన్మానించారు.ఈ కార్యక్రమంలో గౌరవ అధ్యక్షుడు రాజన్న తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వడ్డేపల్లి సుభాష్‌రెడ్డి జన్మదిన వేడుకలు



జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతున్న కాంగ్రెస్ నాయకులు

సదాశివనగర్, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు వడ్డేపల్లి సుభాష్‌రెడ్డి జన్మదిన వేడుకలను ఆదివారం కాంగ్రెస్ పార్టీ నాయకులు ఘనంగా నిర్వహించారు. సదాశివనగర్ మండలానికి చెందిన సీనియర్ నాయకులు సంతోష్, జైపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో కార్యకర్తలు తన నివాసంలో కేక్ కట్ చేసి శాలువతో సన్మానించారు. ప్రజాసేవకుడిగా మంచి పేరున్న సుభాష్‌రెడ్డి భవిషత్తులో మరింత ఉన్నతంగా ఎదగాలని శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు పాల్గొన్నారు.

కలుపు నివారణ మందు ఆవిష్కరణ



కలుపు నివారణ మందు అషిటాక ను ఆవిష్కరిస్తున్న దృశ్యం

సదాశివనగర్, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): మొక్కజొన్నలో అద్భుతమైన కలుపు నివారణ మందు అషిటాకను ఆదివారం మండలంలోని అశోక్ గార్డెన్‌లో ఘనంగా ఆవిష్కరించారు. వందలాది మంది రైతుల సమక్షంలో సీఈవో రవి వేలు చేతుల మీదుగా ఆవిష్కరణ చేశారు. ఈ సందర్బంగా సీఈవో మాట్లాడుతూ ఉత్తర తెలంగాణ జిల్లాలలో అత్యధికంగా మొక్కజొన్న పంటను సాగు చేస్తున్నందున ఈ కలుపు నివారణ మందును కామారెడ్డి జిల్లాలోని సదాశివనగర్ మండలంలో ఆవిష్కరించడం శుభ పరిణామం అన్నారు. గోద్రెజ్ కంపెనీ వారి ఆధ్వర్యంలో నూతన జపనీస్ వారి సౌజన్యంతో ఈ గడ్డి మందును ప్రవేశ పెట్టడం జరిగిందన్నారు. మొక్కజొన్న రెండు నాలుగు ఆకుల మధ్య కాలవ్యవధిలో మోతాదు ప్రకారం వాడినట్లయితే ఎలాంటి కలుపు మొక్కలనైనా నాశనం చేసి పంటకు మంచి ఆధారంగా నిలుస్తుందన్నారు. ఈ అషిటాక కలుపు నివారిణి వలన భూమికి, మొక్కకు మనవాళికి ఎలాంటి హాని జరగదని తెలిపారు. ఈ కార్యక్రమంలో గోద్రెజ్ ఆగ్రోవెట్ సీఈవో రాజు వేలు, జపాన్ ఐఎస్‌కె పంపెనీ ప్రతినిధులు మికియా హోరి, నిమోటో ఫింపి, ఫిరోటోషి కురిసుటని, అజిత్ ప్రేమ్‌నాథ్, రాజుల్ ఇడోలియా, గోద్రెజ్ కంపెనీ ప్రతినిధులు నరసింహారెడ్డి, శిరీష, సత్యనారాయణ, స్థానిక డీలర్లు, డిస్ట్రిబూటర్లు, రైతులు పాల్గొన్నారు.

పోలీసుల తనిఖీలు

సదాశివనగర్, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): సదాశివనగర్ మండల పరిధిలో పోలీసులు చేస్తున్న తనిఖీలను చూసి మండల ప్రజలు శభాష్ పోలీస్ అని అభినందిస్తున్నారు. అర్ధరాత్రి గస్తీ ఏర్పాటు చేయడం, పేకాట స్థావరాలపై సమాచారం సేకరించి దాడులు చేయడం ఇలాంటి చర్యలతో దొంగలకే కాకుండా పేకాట రాయుళ్లకు భయం పట్టుకుంది. ఆదివారం తెల్లవారుజామున మూడు గంటలకు పద్మాజీవాడి ఎక్స్‌రోడ్డు వద్ద తనీఖీలు నిర్వహించగా ఒకరి నుండి బైక్ స్వాధీనం చేసుకున్నారు. అడ్లూర్ ఎల్లారెడ్డిలో పేకాట స్థావరంపై దాడి చేసి 9మందిరి అరెస్ట్ చేసి సుమారు రూ.40వేలు స్వాధీనం చేసుకున్నారు. ఇలాగే నిత్యం నిఘా పెడితే మండలంలో దొంగతనాలు, పేకాట తగ్గుతుందని ప్రజలు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు

బాధిత కుటుంబానికి పరామర్శ



లింగంపల్లిలో వ్యాపారిని పరామర్శిస్తున్న దృశ్యం

సదాశివనగర్, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని లింగంపల్లి గ్రామానికి చెందిన వ్యాపారి, పార్టీ కార్యకర్త కుటుంబాన్ని ఎల్లారెడ్డి మాజీ ఎమ్మెల్యే జాజల సురేందర్ ఆదివారం పరామర్శించారు. రేఖ బాలకిషన్ తండ్రి రాజయ్య ఆరుకోజుల క్రితం అనారోగ్యంతో మరణించగా విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే వారి ఇంటికి వెళ్లి కుటుంబసభ్యులను పరామర్శించి మనోధైర్యాన్ని కల్పించారు. పరామర్శించిన వారిలో తాడ్వాయి సింగిల్ విండో ఛైర్మన్ కపిల్‌రెడ్డి, మోహన్‌రావు, చంద్రారావు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

కిరీటం కోసం 600 గ్రాముల వెండి విరాళం



ఆలయ కమిటీ సభ్యులకు వెండిని అందజేస్తున్న దాత

బాన్సువాడటౌన్ , ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి) : బాన్సువాడ మున్సిపాలిటీ పరిధిలోని వినాయక్‌నగర్‌లో గల శ్రీ వరసిద్ది వినాయక మందిర్ గణనాథుడి కిరీటం కోసం భక్తుడు దొన్కంటి సాయిలు ఆదివారం ఆలయ కమిటీ సభ్యులకు 600గ్రాముల వెండిని విరాళంగా అందజేశాడు. ఈ సందర్బంగా ఆలయ కమిటీ సభ్యులు మాట్లాడుతూ దాతలు ముందుకు వచ్చి ఆలయ అభివృద్ధికి సహకరించడం చాలా అనందంగా ఉందన్నారు. దాతలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

దీర్ఘకాలిక సమస్యలపై పట్టింపేదీ?

- లోతట్టు ప్రాంతాలు, మురికివాడలు, శివారు కాలనీల్లో ప్రజల అవస్థలు
- ప్రధాన రహదారుల వెంట అస్తవ్యస్తంగా మురికికాలువలు
- మురికి కాలువలపై నిర్మాణాలతో చినుకుపడితే వరద నీటి కష్టాలు
- పలుచోట్ల దారుణంగా మారిన మురికి కాలువల పరిస్థితి
- ఆయా కాలనీలో ఏళ్ల తరబడి వరద నీటి సమస్య



ఇందిరాగాంధీ విగ్రహం వద్ద నిలిచిన నీరు

కామారెడ్డి టౌన్, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): ప్రతీ ఐదేళ్లకోసారి ఎన్నికలు రావడం ఆ ఎన్నికల్లో పాతవారి స్థానంలో కొత్తవారు ఎన్నికయిన కామారెడ్డి మున్సిపల్ పరిధిలో ప్రజల సమస్యలు మాత్రం పాతగానే ఉంటున్నాయే తప్ప వారికి కొత్త రూపురేఖలు చూపడంలో ఇటు ప్రజాప్రతినిధులు అటు అధికారులు మాత్రం విఫలమవుతునే వస్తున్నారు. ఆయా వార్డుల్లో గెలిచిన ప్రజాప్రతినిధులు ఐదేళ్ల పదవికాలంలో వేసిన రోడ్ల పైనే డబుల్ రోడ్లు వేస్తు, నిర్మించిన వాటి స్థానంలో సంవత్సర కాలంలో మరో మురికి కాలువలను నిర్మించారే తప్ప పలు చోట్ల ఏళ్ల తరబడి సమస్యలతో ప్రజలు అల్లాడుతున్నారని ఆ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపుదామనే శ్రద్ధ వహించలేదు. ఇక అధికారుల పనితీరు వారికి ఏ మాత్రం తీసిపోకుండా ఉంది. ప్రజాప్రతినిధుల పదవికాలం ముగిసి సంవత్సరంన్నర దగ్గరకు వస్తున్నా స్థానిక అధికారులు, ఉన్నతాధికారులకు కనీస పట్టింపు లేకుండా పోయింది.

చినుకుపడితే చిత్తడే..

కామారెడ్డి జిల్లా కేంద్రంలో చిన్నపాటి చినుకు పడితే చాలు ఆయా వార్డుల్లో రోడ్లన్నీ చిత్తడిగా మారుతున్నాయి. రోడ్ల వెంబడి గుంతలు, వర్షపు నీరు ప్రవహించేందుకు మురికి కాలువలు లేకపోవడం, ఉన్న చోట్ల పూడికలు సరిగ్గా తీయకపోవడం, కొన్నిచోట్ల మురికి కాలువలను మొత్తం మూసి వేయడంతో వర్షపు నీరు నిలిచి రోడ్ల వెంట ప్రయాణించాలంటేనే ప్రజలు నానా అవస్థలు పడాల్సి వస్తోంది. చిన్నపాటి వర్షాలు కురుస్తేనే రోడ్ల వెంట ఉన్న గుంతలల్లో నీరు చేరి మడుగులు కడుతున్నాయి. ప్రధానంగా లోతట్టు ప్రాంతాలు, మురికివాడలు, శివారు కాలనీల్లో మాత్రం ఈ సమస్య తీవ్రంగా ఏర్పడుతోంది. వరద తగ్గిన తర్వాత అక్కడే మిగిలిపోతున్న వ్యర్థాలతో దుర్గంధం, ఈగలు, దోమలతో ప్రజలు అవస్థలు పడుతున్నారు.



పోలీసుస్టేషన్ ముందు రైల్వేకమాన్ కింద నిలిచిన వరద నీరు

దీర్ఘకాలికంగా ఉన్న సమస్యలపై పట్టింపు కరువు

కామారెడ్డిలోని ప్రధాన రహదారులు మాత్రమే శుభ్రం చేస్తున్నారే తప్ప అంతర్గత రోడ్లలో శుభ్రత, ప్రధాన రోడ్లలోని మురికి కాలువలపై నిర్మాణాలు వాటిలో నిలిచిన పూడికతీత, మురికి కాలువలపై చేపట్టిన నిర్మాణాలపై అసలు పట్టించుకున్నవారే కరువయ్యారు. దీంతో చాలా చోట్ల మురికి కాలువల పరిస్థితి దారుణంగా తయారైంది. చిన్నపాటి వర్షం పడితే చాలు ఏళ్ల తరబడి నీరంతా రోడ్లపై మడుగులు కట్టి రోగాలకు ఆవాసాలుగా మారుతున్నా కనీస చర్యలు కరువయ్యాయని ప్రజలు పెదవి విరుస్తున్నారు. ప్రధానంగా వ్యాపార సంస్థల నిర్వహణ ప్రాంతాల్లో మురికికాలువలను పూర్తిగా మూసివేయడంతో ఆ ప్రాంతాలల్లో మురికి కాలువల వెంట పూడికమట్టి పేరుకపోయింది. పలు చోట్ల నాలాలపై నిర్మాణాలు చేపట్టిన మున్సిపల్ అధికారులు చూసీచూడనట్లు వ్యవహరించడంతో ఈ ఇబ్బందులు ఏర్పడుతున్నాయని ఆ ప్రాంతంలో నివాసం ఉండే ప్రజలు పేర్కొంటున్నారు.

● విద్యానగర్ సాయిబాబా గుడి నుంచి కొత్త బస్టాండ్ వెళ్లే ప్రాంతం, జీవదాన్ పాఠశాల వైపు వెళ్లే ప్రాంతంలో మురుగు కాల్వల పరిస్థితి దారుణంగా తయారైంది. చాలా చోట్ల అసలు మురికి కాలువలు అనేవి లేవు. వర్షం పడితే నీరంతా వచ్చి సాయిబాబా గుడి ప్రాంతంలో మడుగులు కట్టే పరిస్థితి ఏళ్లతరబడి ఉంది.

● రైల్వే కమాన్ కింద పట్టణ పోలీసుస్టేషన్ ముందు పరిస్థితి దారుణం. ఆ మురికి కాలువలో పూడిక పేరుకపోవడం, మురికి కాలువల ద్వారా నీరు పోకుండా నిర్మాణాలు చేపట్టడంతో చిన్నపాటి కుంటను తలపిస్తోంది. ఈ రోడ్డు వెంట ఇందిరాగాంధీ చౌరస్తా వరకు ఇదే పరిస్థితి నెలకొంటుంది. అసలు ఆ మురికికాలువ ఎన్ని సంవత్సరాల కింద నిర్మించారనేది అంతుచిక్కని ప్రశ్న. ప్రతీసారి నీరు నిల్వడం ట్యాంకర్ల ద్వారా తోడేయడం చేస్తున్నారే తప్ప శాశ్వత పరిష్కారం మాత్రం చూపడం లేదు.

● సిరిసిల్లా రోడ్డు నుంచి వీక్లి మార్కెట్‌కు వచ్చే ప్రాంతంలో కనీసం మురికి కాలువలు లేక ఏళ్ల గడుస్తున్నాయి. కల్లుకంపౌండ్ ముందు నుంచి సిరిసిల్లా రోడ్డు వరకు అసలు మురికి కాలువలనేవే లేవు. ఈ రోడ్డులో నిత్యం వందలాది మంది ప్రయాణాలు చేస్తున్నా ఇప్పటి వరకు మురికికాలువల నిర్మాణం చేపట్టకపోవడం చూస్తేనే తెలుస్తోంది ప్రజల అవస్థలు ఎంతమేర తీరుస్తున్నారనేది.

● సిరిసిల్లా రోడ్డులోని గాంధీగంజ్ నుంచి అయ్యప్పకమాన్ వరకు మురికి కాలువలు అంతంత మాత్రంగానే ఉన్నాయి. ఉన్న పెద్దమురికి కాలువల్లో చెత్త చెదారం చేరి నీరు పోవడం గగనంగా మారింది. గత రెండు రోజుల క్రితం పడిన వర్షంతో గాంధీగంజ్ ప్రాంతం వద్ద మురుగునీరు వరదలా పారీ రోడ్లపై పారడంతో స్థానిక వ్యాపారులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

● పొట్టి శ్రీరాములు విగ్రహం నుంచి బంగారు దుకాణ సముదాయాల వద్ద గతంలో నూతన మురికి కాలువలు నిర్మించినా సరైన ప్రణాళికలు లేకుండా నిర్మించడంతో మురికి కాలువల నిర్మాణం జరిగింది. కానీ ప్రజలకు మురికినీటి అవస్థలు మాత్రం తీరలేదు. ఇవి కేవలం మచ్చుకు కొన్ని ప్రధాన రహదారుల వెంట ఉన్న సమస్యలే అంతర్గతంగా వార్డుల్లో ప్రజలు పడుతున్న ఇబ్బందులు వర్ణణాతీతం.

● ఇక శివారు ప్రాంతాలలోని అవస్థలు చెప్పనక్కర్లలేదు. ఆయా వార్డుల్లో ఏళ్ల తరబడి సమస్యలు నెలకొంటున్నాయి. ఇప్పటికీ మారుమూల గ్రామాల్లో మాదిరి మట్టిరోడ్లే, మురికి కాలువలు లేక రోడ్లపై నిలిచిన మురుగు చాలా ప్రాంతాల్లో కనిపిస్తుంటాయి. నిలిచిన వరద నీరు దోమలు, ఈగలకు ఆవాస కేంద్రాలుగా మారి ప్రజలకు రోగాలను తెచ్చిపెడుతున్నాయి. ఇలా అనేక సమస్యలతో ప్రజలు అవస్థలు పడుతున్న మున్సిపల్ అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదనే విమర్శలు వ్యక్తం అవుతున్నాయి.

ఘనంగా పోచమ్మ బోనాల పండుగ



బోనాల పండగలో పోతరాజుల విన్యాసాలు



పిట్లంలో బారెడి పోచమ్మ అలంకరణ దృశ్యం

పిట్లం ఆగస్ట్ 10(ఆంధ్రజ్యోతి):అమ్మ బైలెల్లినాదిరో తల్లి బైలెల్లి నాదిరో అంటు హైదరాబాద్ నుండి విచ్చేసిన కళాకారుల ఆటలు, పాటలలు అందిరిని అలరిం చాయి. ఆదివారం పిట్లంలో బారెడి పోచమ్మ బోనాల పండుగ కనుల పండుగగా అంరంగ వైభవంగా జరిగినాయి. కళాకారులు, పోతరాజులు. బోన మెత్తిన శివసత్తుల ఆటలు గ్రామ రామాలయం నుండి ప్రారంభమైనాయి. వారితో పాటు మహిళలు బోనాలు ఎత్తుకొని అమ్మ వారికి సమర్పించారు.డిజె ఆట పాటలతో బోనాలు ఎత్తిన మహిళలు, శివశత్తులు అమ్మవారి ఆలయానికి చెరుకొని మొక్కులు తీర్చుకున్నారు. బోనాల కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జుక్కల్ మాజీ ఎమ్మెల్యే హన్మంత్‌షిండే విచ్చేసి, కళాకారులతో, బోనాల వారితో కలిసి ఆలయానికి చెరుకున్నారు.ఆలయ కమిటి సభ్యులు మాజీ ఎమ్మెల్యేకు సన్మానం చెసి తీర్థప్రసాదాలు అందజేశారు. గ్రామస్తులు ఉదయం నుంచే బారెడి పోచమ్మ ఆలయానికి చేరుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు అన్నప్రసాదం అందజేశారు. కార్యక్రమంలో జగదీష్, వానరి రమేష్, ప్రతాప్‌రెడ్డి, విజయ్, నర్సాగౌడ్, నవీన్, శ్రీనివాస్‌రెడ్డి, నారాయణరెడ్డి, భక్తులు గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

అలరించిన స్వర సౌరభం

నిజామాబాద్ కల్చరల్, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి):గాయనీ గాయకులతో స్వర సౌరభం సాంస్కృతిక కళాసంస్థ నిర్వహించిన పాత హిందీ పాటలు అలరించాయి. ఆదివారం జిల్లా కేంద్రంలోని హరిచరణ్ మార్వడి పాఠశాలలో నిర్వహించిన హిందీ ఫిల్మ్ గానే కార్యక్రమంలో హిందీ పాటలు హోరెత్తించాయి. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన రాజస్థానీ శిక్షణ సంస్థ అధ్యక్షుడు శ్యామ్‌జీ అగర్వాల్ మాట్లాడు తూ పాత పాటలతో ఇలాంటి కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడం అభి నందనీయమని అన్నారు. నాటి పాటలు ప్రేక్షకులను మైమరిపించే విధంగా ఉండటమే కాకుండా మానసిక ప్రశాంతతను అందించేవని అన్నారు. ఈ కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు ఆయాచితం నాగరాజు శర్మ, సముద్రాల రాములు, మాకునూరి పురుషోత్తమచార్య, రాజ్‌కు మార్ సుబేదార్, అన్నపూర్ణ, నాగరాజుశర్మ, శ్రీలతలు తమ పాటలతో ప్రేక్షకులను ఆకట్టుకున్నారు. ఈ కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు, సాహితీవేత్తలు, ప్రేక్షకులు పాల్గొన్నారు.

జలాల్ బుకారి దర్గా ఉర్సు ఉత్సవాలు ప్రారంభం

బోధన్,ఆగస్టు10(ఆంధ్రజ్యోతి): జలాల్ బుకారి దర్గా ఉర్సు ఉత్సవాలు ఆదివారం ప్రారంభమయ్యాయి. రెండు రోజుల పాటు జరిగే ఉర్సు ఉత్సవాలు ఘనంగా నిర్వహించబడతాయి. బోధన్ పట్టణంలో ప్రఖ్యాతిగాంచిన జలాల్ బుకారి దర్గా ఉర్సు ఉత్సవాలను దర్గా ముస్తావలీ ఇంటి నుంచి ఒంటెపై చాదర్‌ను తీసుకువచ్చి ప్రత్యేక ప్రార్థనల అనంతరం ప్రారంభించారు. తలపై చాదర్లు, పూలతో దర్గాకు చేరుకుని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ప్రజలు అందరు ఆరోగ్యంగా ఉండాలని ప్రత్యేక ప్రార్థనలు చేశామన్నారు. ఆదివారం మొదటి రోజు సందల్ అని, సోమవారం చిరాక్ అని కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. సోమవారం పట్టణంలోని అన్ని వార్డుల నుంచి మైనారిటీ యువత చాదర్‌లను ప్రత్యేక ప్రార్థనలతో తీసుకువస్తారన్నారు.అనంతరం జలాల్ బుకారి దర్గా ప్రాంగణంలో కవ్వాలి తదితర కార్యక్రమాలు ఉంటాయని ఉర్సు ఉత్సవ కమిటీ అధ్యక్షులు షర్ఫోద్దీన్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఐఎం పార్టీ పట్టణ అధ్యక్షులు మీర్ ఇలియాజ్ అలీ, పట్టణ మైనారిటీ ప్రముఖులు, యువకులు పాల్గొన్నారు.

సంఘాల ద్వారా సామాజిక సమైక్యత: ఎమ్మెల్యే ధన్‌పాల్

సుభాష్‌నగర్, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి):సంఘాల ద్వారా సామాజిక సమైక్యత పెరుగుతుందని గాండ్ల సంఘం తన సేవా కార్యక్రమాల ద్వారా మంచి మార్గదర్శిగా నిలవాలని నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్త ఆకాంక్షించారు. జిల్లా కేంద్రంలోని సిర్నాపల్లి గడి గాండ్ల పట్టణ సంఘం ప్రమాణస్వీకారోత్సవానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇందూరు పట్టణ గాండ్ల సంఘం రాష్ట్రంలో ఆదర్శంగా నిలిచే విధంగా ఐక్యమత్యంతో అంచెలంచెలుగా ఎదుగుతుందని అభినందించా రు. గాండ్ల సంఘం అభివృద్ధికి నూతన కమిటీకి నా పూర్తి మద్దతు ఉంటుందనిపేర్కొన్నారు. అనంతరం నూతనంగా ఎన్నుకోబడిన కార్య వర్గాన్ని తన చేతుల మీదుగా ప్రమాణస్వీకారం చేయించారు. ఈ కార్య క్రమంలో నూతన అధ్యక్షుడు నాగరాజు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేష్ కులాచారి పటేల్, కాంగ్రెస్ నాయకులు నరాల రత్నాకర్, రాంభూపాల్, గాండ్ల సంఘం కార్యవర్గం ఆసోళ్ల రాజేందర్, గోపి, కాసర్ల మోహన్, సాయన్న, క్యాషియర్ హన్మాండ్లు, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా ప్రారంభమైన జర్నలిస్టుల క్రీడాపోటీలు

సుభాష్‌నగర్,ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి):స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని నిజామాబాద్ ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న క్రీడాపోటీలు ఆదివారం ఉత్సాహంగా ప్రారంభమయ్యాయి. మొదట జర్నలిస్టుల క్రికెట్‌పోటీలు జరిగాయి. ఈపోటీలో విజేతలుగా రాజు-11, రన్నరప్‌గా సతీష్-11లు నిలిచాయి. ఈ సందర్భంగా ప్రెస్‌క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు రామకృష్ణ, శేఖర్‌లు మాట్లాడుతూ ప్రతీ సంవత్సరం జర్నలిస్టుల మానసిక ఉల్లాసానికి క్రీడలు నిర్వహిస్తామని తెలిపారు. మొదటి క్రికెట్ పోటీలలో సతీష్-11 జట్టు మొదట బ్యాటింగ్ చేసి 12 ఓవర్లలో 89 పరుగులకు 3వికెట్లు కోల్పోయింది. 90 పరుగుల లక్ష్యాన్ని రాజు జట్టు ముందు ఉంచింది. తర్వాత బ్యాటింగ్ చేసిన రాజుజట్టు 1 వికెట్ కోల్పోయి 90 పరుగుల లక్ష్యాన్ని చేధించింది. ఈ పోటీలలో ప్రెస్‌క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

నేడు ఎమ్మెల్యే పర్యటన

పెద్దకొడప్‌గల్, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): పెద్ద కొడప్‌గల్ మండలంలో సోమవారం జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మికాంతారావ్ పర్యటించనున్నట్లు మండల పార్టీ అధ్యక్షులు మహేందర్ రెడ్డి తెలిపారు. ఈ సందర్బంగా మహేందర్ రెడ్డి మాట్లాడుతు మధ్యాహ్నం 12.30 గంటలకు గురుకుల పాఠశాల సందర్శన, అనంతరం లబ్దిదారులకు కొత్తగా మంజూరైన రేషన్ కార్డుల పంపిణీ చేస్తారని తెలిపారు. దీంతో పాటుగానే సిఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ, కళ్యాణ లక్ష్మి చెక్కులను పంపిణీ చేస్తారని తెలిపారు. అనంతరం మండల కేంద్రంలో వివిధ గ్రామాలకు చెందిన నాయకులు, కార్యకర్తల సమావేశం ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమానికి మండలంలోని పార్టీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

రైతు బీమాకు దరఖాస్తు చేసుకోండి

పెద్ద కొడప్‌గల్, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన రైతులు రైతు బీమాకు దరఖాస్తు చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి కిషన్ తెలిపారు. 2025-26 సంవత్సరానికి గాను కొత్తగా భూమి కొనుగోలు చేసిన రైతులు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. జూన్ 05 వరకు భూభారతి ద్వారా పట్టాదార్ పాసుపుస్తకాలు పొందిన రైతులు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. ఇందుకోసం రైతు ఆధార్ కార్డు, నామినీ ఆధార్ కార్డు, పట్టాదారు పాసుపుస్తకం లేదా తహసీల్దార్ డిజిటల్ సంతకం గల పేపర్ జిరాక్స్‌తో దరఖాస్తులను ఈ నెల 13 లోగా తమ గ్రామాలకు చెందిన ఏఈవోలకు అంద జేయాలని సూచించారు.

పాదయాత్ర భక్తులకు పండ్లు పంపిణీ



భక్తులకు పండ్లు పంపిణీ చేస్తున్న ఎస్ఐ అరుణ్‌కుమార్

పెద్ద కొడప్‌గల్, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): మండలం గుండా పాదయాత్ర చేస్తున్న భక్తులకు ఎస్ఐ అరుణ్ కుమార్ ఆదివారం పండ్లు, పాలు, వాటర్ బాటిల్స్ పంపిణీ చేశారు. జుక్కల్ మండలం లాడెగాం గ్రామానికి చెందిన భక్తులు ప్రతి సంవత్సరం తమ గ్రామం నుండి పిట్లం మండలం చిన్న కొడప్‌గల్ గ్రామ శివారులో గల రామలింగేశ్వర ఆలయానికి పాదయాత్రగా వెల్తారు. ఇదే క్రమంలో ఆదివారం పెద్ద కొడప్‌గల్ మండలం గుండా పాదయాత్రగా వెల్తున్న భక్తులకు ఎస్ఐ పాలు, పండ్లు, వాటర్‌బాటిల్స్ పంపిణీ చేశారు. ఈ సందర్బంగా ఎస్ఐ మాట్లాడుతు పాదయాత్రగా వెల్తున్న భక్తులకు తన వంతుగా సేవ చేశానని తెలిపారు. ఈ కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ సత్తయ్య, రమేష్, రవీందర్, శ్రీనివాస్, నాగయ్య తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం


బాన్సువాడటౌన్ , ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి) : బాన్సువాడ పట్టణంలో విద్యుత్ మరమ్మతులు కొనసాగుతున్న దృష్ట్యా సోమవారం చైతన్య కాలనీ , శ్రీరామ కాలనీ , సంగమేశ్వర కాలనీ , పాతబాన్సువాడలో ఉదయం 9.30గంటల నుండి సాయంత్రం 5.30గంటలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్‌శాఖ అధికారులు తెలిపారు. ప్రజలు విద్యుత్ సిబ్బందికి సహకరించాలని వారు కోరారు.

కొనసాగుతున్న తీజ్ ఉత్సవాలు

డిచ్‌పల్లి, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి):తెలంగాణ యూనివర్సిటీలో ఏడవ రోజు తీజ్ ఉత్సవాలు వైభవంగా సాగాయి. ఈ సందర్భంగా ముఖ్య అతిథి సేవాలాల్ మహారాజ్ వారసులు నరసింహ ఆచార్యతో పాటు డాక్టర్ రమేష్ నాయక్ మాట్లాడుతూ తీజ్ పండుగ యొక్క సంస్కృతులను అదేవిధంగా సేవాలాల్ మహారాజ్ బోధనలు గుర్తు చేశారు. అదేవిధంగా ప్రజలందరికీ చదువుతున్న విద్యార్థులకు కూడా కలిసి మెలిసి ఉండాలని వారు కోరారు. అదే విధంగా యూనివర్సిటీ గిరిజన శక్తి అధ్యక్షుడు శీను రాథోడ్ సమాజంలో సేవాలాల్ మహా రాజ్ వారస త్వాన్ని వారి యొక్క ఆశయాన్ని కొనసాగిస్తామని చెప్పారు. ఈ కార్యక్ర మంలో బంజారా యువతులు, యూనివర్సిటీ అధ్యక్షులు సాగర్ నా యక్, సచిన్, మోహన్, రాము, యువ రైటర్ రాజు తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

సుభాష్‌నగర్, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల చంద్రశేఖర్ కాలనీలో చదువుతున్న 2007-08 సంవత్సరం 10వ తరగతి విద్యార్థులు ఉపాధ్యాయుల సమక్షంలో ఆత్మీయ సమ్మేళనం కార్యక్ర మాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులందరూ ఒకేచోట చేరి విద్య ను అభ్యసించిన ఉపాధ్యాయులకు ఘన స్వాగతం పలికి సన్మానించారు. అంతేకాకుండా విద్యార్థులు విద్యను అభ్యసించిన సమయంలో చేసిన పనులను గుర్తు చేసుకొని ఆనందం వ్యక్తం చేశారు. అనంతరం పూర్వ విద్యార్థుల సమ్మేళనంలో ఆటలు పాటలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించుకొని ఆనందా లను పంచుకున్నారు. ఆత్మీయ సమ్మేళనానికి గుర్తుగా ఉపాధ్యాయుల చేత పూర్వ విద్యార్థులు మెమోంటోతో బహుకరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు లక్ష్మణ్, ఉపాధ్యాయులు పండరి, సుజాత, రజిని, మీనా, జ్యోతి, ఆనంద్‌రావు, లింబాద్రి, ప్రకాష్, పూర్వవిద్యార్థులు పాల్గొన్నారు.



సినిమా గైడ్ కామారెడ్డి

కామారెడ్డి

దర్శన్ - అతడు

ప్రియా 70 - హరిహర వీరమల్లు


ప్రియా 35 - మహావతర్ నరసింహ

బాన్సువాడ

మహేశ్వరి - కింగ్‌డమ్

వెంకటేశ్వర - మహావతార్ నరసింహా

చికెన్ ధరలు



రకం	:	లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	:	120	140	170
వెన్‌కాబ్(కిలో)	:	130	160	190

